స్కాన్ చేయండి...
పేపర్ చదవండి...

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
RNI No: TELTEL/2024/86684

బుధవారం | 30.04.2025 | సంపుటి : 2 | సంచిక :89 | పేజీలు : 8 | వెల : 2/-

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 91824 74575




## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- ఆదివాసీల ప్రయోజనాలకు విఘాతం కలిగించొద్దు
- మంత్రి సీతక్క డిమాండ్

03

## వాట్సప్ వెబ్ నుంచి నేరుగా కాల్స్..

యాప్‌తో పనిలేదిక



07



07

## సొంతగడ్డపై పోరాడి ఓడిన ఢిల్లీ



02

## నేడు.. రేపు ఓ మోస్తరు వర్షాలు



## కాళేశ్వరం అవినీతిని కప్పిపుచ్చే యత్నం

- కేంద్రం నివేదికను తప్పుపట్టడం దుర్మార్గం
- సొంత నిర్ణయాలతో లక్షకోట్లు నీటిపాటుచేశారు
- అయినా సిగ్గూఎగ్గు లేకుండా మాట్లాడితే ఎలా
- బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ఏప్రిల్ 29 :

కాళేశ్వరం ప్రాజెక్టులో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇచ్చిన తర్వాత కూడా భారాస నేతలు సిగ్గుపడటం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. కావాలని ఎదురుదాడి చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇంతపెద్ద కుంభకోణం జరిగి లక్షకోట్లు నీటి పాలైతే దానిమీద వారికి చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. 'ఎన్‌డీఎస్‌ఏ ఎవరు..? వాళ్లెవరు నివేదిక ఇవ్వడానికి' అని కించపరిచేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎక్కువ కమీషన్లు వస్తాయని గత ప్రభుత్వ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన నివేదికపై పవర్‌-పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

మిగతా 2 లో

# మిస్ వరల్డ్ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు



- లోటుపాట్లు లేకుండా పక్కాగా భద్రతా చర్యలు
- చారిత్రక ప్రాంతల సందర్శనకు ఏర్పాటు చేయండి
- అతిథులకు చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాల్ని చూపించాలి
- సమీక్షలో అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి

"రాష్ట్రం ఆతిథ్యం ఇస్తున్న మిస్‌వరల్డ్‌-2025 పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వస్తున్న వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని పోలీసు అధికారులకు స్పష్టంచేశారు. మిస్ వరల్డ్ పోటీలపై మంగళవారం ఆయన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షించారు. పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు."

హైదరాబాద్, ఏప్రిల్ 29 :

మిస్ వరల్డ్ పోటీలను కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహించాలని, ఎక్కడా లోటుపాట్లు రాకుండా చూసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పోటీల్లో పాల్గొనేందుకు వస్తున్న వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఉన్నతాధికారులనురేవంత్‌రెడ్డి ఆదేశించారు. అందులో భాగంగా ఎయిర్ పోర్టులు, అతిథులు బస చేసే హోటళ్లతోపాటు అందాల పోటీలు జరిగే ప్రదేశాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. అతిథులు.. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు- చేయాలన్న సూచించారు.

మిగతా 2 లో



## పర్యాటకరంగంలో బలమైన పునాది వేశా

మరోమారు ట్వీట్ చేసిన స్మితా సబర్వాల్

03

## నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

03

## ఉగ్రవాదం అణచివేతలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

- సైన్యం నిర్ణయం మేరకు ఆపరేషన్ నిర్వహణ
- భారత సైన్యం శక్తి సామర్థ్యాలపై అపార నమ్మకం
- ఉన్నతస్థాయి సమీక్షలో ప్రధాని మోదీ విస్పష్ట ప్రకటన



02

## తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్

- 7వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు నిర్ణయం
- సమ్మె పోస్టర్ ఆవిష్కరించిన కార్మిక జెఏసి



03



## పాక్ ప్రతినిధుల్లా కాంగ్రెస్ నేతల తీరు

- సోషల్ మీడియాలో మోడీపై అభ్యంతరకర పోస్టులు
- పాక్ నేతలు రీ ట్వీట్ చేయడం దేనికి సందేశం
- కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 29 :** పాకిస్తాన్ ఆలోచనల ప్రకారం కాంగ్రెస్ వ్యవహరిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యతను మరిచి ప్రధాన మంత్రిని కించపరిచేలా సోషల్ మీడియా పోస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. దాయాది దేశంతో యుద్ధ మేఘాలు కమ్ముకున్న

మిగతా 2 లో

## బిజెపి, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు



- కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికలో అవినీతి ప్రస్తావన లేదు
- రూ.లక్ష కోట్లు వృథా అయితే.. నీళ్లెలా వస్తున్నాయి?
- ఉత్తమ్ వ్యాఖ్యలను ఖండించిన మాజీమంత్రి హరీశ్ రావు

02



## దేశానికి రోల్ మోడల్‌గా భూ భారతి

- రాష్ట్రంలో భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం
- భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి

03

దేశానికి రోల్ మోడల్‌గా భూ భారతి నిలుస్తుందని రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కార మార్గం చూపాలన్న సంకల్పంతో ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ చట్టాన్ని తెచ్చిందని అన్నారు. ఈ చట్టం రైతులకు శ్రీరామరక్ష అని అన్నారు.భూ భారతి 2025 చట్టంపై మంగళవారం వరంగల్ నగరంలోని నాని గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు.



## మిస్ వరల్డ్ పోటీలకు పటిష్ట ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

విభాగాల వారీగా ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఉన్నతాధికారులకు సీఎం వివరించారు. అలాగే నగరంలో పెండింగ్‌లో ఉన్న బ్యూటిఫికేషన్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టే కార్యక్రమాలు, ఏర్పాట్లకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. హైదరాబాద్ వేదికగా 72వ మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. ఇవి మే 7వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు జరగనున్నాయి. వేర్వేరు వేదికలపై వేర్వేరు థీమ్‌లతో వీటిని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు.దేశ,విదేశాల నుంచి మిస్ వరల్డ్ పోటీ-ల్లో పాల్గొనేందుకు అతిథులు మే 6, 7 తేదీల్లో హైదరాబాద్ తరలిరానున్నారు. మే 10వ తేదీన గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీ-లు ప్రారంభమవుతున్నాయి. మే 12వ తేదీన బుద్ధభవన్‌లో అందాల భామలతో అధ్యాత్మిక పర్యటన ఏర్పాటు- చేశారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్, హదరాబాద్‌లలో హెరిటేజ్ వాక్‌లు ఏర్పాటు- చేశారు. ఇక మే 13వ తేదీన చౌమహల్లా ప్యాలెస్‌లో సుందరాంగులు, అతిథులకు వెలకం డిన్నర్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## కాళేశ్వరం అవినీతిని కప్పిపుచ్చే యత్నం

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్ల కోసం ప్రాజెక్టు అంచనాను భారీగా పెంచుకుంటూ పోయారని మండిపడ్డారు. రూ.80వేల కోట్లకు అనుమతులు తీసుకుంటే..ఇప్పటికే రూ.లక్ష కోట్లు దాటిపోయిందని అన్నారు. వివిధ పేర్లతో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రుణాలు తీసుకున్నారు. అధికశాతం వడ్డీకి స్వల్పకాలిక రుణాలు తీసుకున్నారు. భారాస హయాంలోనే ప్రాజెక్టు నిర్మించారు. వాళ్ల హయాంలోనే కూలిపోయింది. ఇంతకన్నా సిగ్గుచేటు మరోటి ఉండదన్నారు. బ్యారేజీ పూర్తయిన తొలి ఏడాదిలోనే లోపాలు బయటపడ్డాయి. లోపాలు ఉన్నాయని ఇంజినీర్లు చెప్పినా సరే.. పట్టించుకోకపోవడంతో నష్ట తీవ్రత పెరిగింది. మేడిగడ్డ నిర్మాణంలో లోపాలపై భారాస ఉన్నప్పుడు కూడా ప్రాథమిక నివేదిక ఇచ్చారు. బ్యారేజీ లోపలి భాగంలో నీళ్లు భూమిలోకి పోయి బ్యారేజీ వెలుపలకు వస్తున్నాయి. బ్యారేజీ నిర్మాణానికి మట్టి పరీక్షలు, నాణ్యత పరీక్షలు చేయలేదు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ సీపేజీ ఉందని ఎన్‌డీఎస్‌ఏ నివేదిక చెబుతోంది. నిర్మాణం మొదలుపెట్టిన 6 నెలల తర్వాత సీడబ్ల్యూసీకి డీపీఆర్ పంపించారు. ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్చవద్దని ఐదుగురు విశ్రాంత ఇంజినీర్లతో కేసీఆర్ ఏర్పాటు- చేసిన నిపుణుల బృందమే చెప్పింది. సీడబ్ల్యూసీకి ఇచ్చిన డీపీఆర్‌లో కూడా తర్వాత ఇష్టారాజ్యంగా మార్పులు చేశారు. డీపీఆర్‌కు విరుద్ధంగా కేసీఆర్ ఎలా చెప్తే అలా నిర్మించేశారు. భారాస నేతల నిర్లక్ష్యం, కక్కుర్తి, అవినీతి వల్ల ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని ఉత్తమ్ మండిపడ్డారు. వజ్రోత్సవ సభలో ఏదేదో మాట్లాడిని కెసిఆర్ దీనిపై ఎందుకు నోరు మెదపలేదన్నారు. ఎన్‌డీఎస్‌ఏ అనేది పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడింది. చట్టం చేసినప్పుడు భారాస ఎంపీలు మద్దతిచ్చారు. బ్యారేజీల భద్రతపై ఎన్‌డీఎస్‌ఏ అత్యున్నత బోర్డు. దేశంలోని 700 బ్యారేజీల భద్రతను పరిశీలిస్తోంది. వివిధ అంశాల్లో అంతర్జాతీయ స్థాయి నిపుణులతో ఈ బోర్డు ఏర్పాటైంది. తుమ్మడిహట్టి కాదని మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించడమే ప్రధాన లోపమని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. మేడిగడ్డ ప్రతిపాదనను సీడబ్ల్యూసీ ప్రారంభంలోనే తోసిపుచ్చింది. ఇవన్నీ మరచి బిఆర్ఎస్ నేతలు మాట్లాడడానికి సిగ్గుండాలని అన్నారు.

## పాక్ ప్రతినిధుల్లా కాంగ్రెస్ నేతల తీరు

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో.. బాధ్య తాయుత ప్రతిపక్షంగా వ్యవహరించాల్సిన కాంగ్రెస్ పార్టీ.. అన్ని విలువలకు తిలోదకాలిచ్చింది. పాకిస్తాన్, ఉగ్రవాదులు మాట్లాడుతున్న భాషలో.. మాట్లాడుతోంది. పాకిస్తాన్ మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నేతల ఆలోచన ఒకే రకంగా ఉందని అర్థమవుతోందన్నారు. పాకిస్తాన్ మంత్రులు.. భారతదేశానికి వ్యతిరేకంగా మాట్లాడితే, దానికి మద్దతుగా కాంగ్రెస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటు. కాంగ్రెస్ నేతలు చేసిన ట్వీవట్లను పాకిస్తాన్ రీట్వీట్ చేయడం.. వీరిద్దరి మధ్య ఉన్న అక్రమ స్నేహబంధానికి అద్దం పడుతోంది. పహల్‌గామ్ ఘటన తర్వాత.. భారతీయుల రక్తం ఉడుకుతోంది. పాక్ కు దిమ్మతిరిగే సమాధానం ఇస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. ఈ సమయంలో ప్రధానమంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి, భారతీయ సైన్యానికి అండగా ఉండాల్సిన బాధ్యతను మరిచిన కాంగ్రెస్ పార్టీ.. ఉగ్రవాదుల భాషలో మాట్లాడుతుండటం అత్యంత హేయమైనచర్య. ప్రధానమంత్రి చిత్రంలో తలను తొలగించి 'గాయబ్'అని పోస్టు చేయడం కాంగ్రెస్ పార్టీలో పెరుగుతున్న అసహనానికి నిదర్శనమని అన్నారు. ఈ సారి కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మద్దతిచ్చాయి. మజ్లిస్ పార్టీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. మజ్లిస్ పార్టీని ఎదిరించే సత్తా బీజేపీకే ఉందనే సంకేతాలు స్పష్టంగా హైదరాబాద్ ప్రజలకు ఇచ్చాం.. రాబోవు గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ, మజ్లిస్ పార్టీల మధ్యే పోటీ ఉంటుందని కిషన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో కంటే మోదీ వచ్చాక ఉగ్రవాదం పూర్తిగా తగ్గింది.. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్ లో అనేక సార్లు బాంబు బ్లాస్ట్ లు జరిగాయి.. ఉగ్రవాదంపై జీరో టోలరెన్స్ విధానంతో మంచి ఫలితాలు వచ్చాయి.. 370 రద్దు తర్వాత కశ్మీర్ అభివృద్ధి వైపుకు పయనిస్తుంది.. కశ్మీర్ అభివృద్ధి ఈ దేశంలో ఉన్న అంతర్గత శక్తులకు, పాకిస్తాన్ శక్తులకు ఏమాత్రం ఇష్టం లేదు.. శాంతి సమస్యతో ముందుకు వెళ్తున్న కశ్మీర్ ను చూసి పాకిస్తాన్ సహించలేకపోతుంది.. పెహల్గంలో హిందువులు, ముస్లింలను విభజించి, అతి కిరాతంగా కాల్చి చంపారు.. కశ్మీర్ సినిమాను నాడు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకింది.. నేడు పెహల్గం ఘటన అదే కశ్మీర్ ఫైల్స్ సినిమాను తలపించింది.. పెహల్గం ఘటనను యావత్ దేశం వ్యతిరేకిస్తోంది.. దేశం శాంతి, సామరస్యంతో ఉండాలి.. ఉగ్ర శక్తులు భారతాన్ని ఏం చెయ్యలేవు.. భారత ప్రజలు ఐకమత్యంతో కలిసి ముందుకు నడవాలని మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## వక్ఫ్ సవరణ చట్టంపై తాజా పిటిషన్ల విచారణకు సుప్రీం నిరాకరణ

**దిల్లీ:** వక్ఫ్ సవరణ చట్టం-2025 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన తాజా పిటిషన్ల విచారణకు సుప్రీం కోర్టు మంగళవారం నిరాకరించింది. ఇదే అంశంపై ఇప్పటికే విచారిస్తున్న వ్యాజ్యాలకు మరికొన్నింటిని జతచేయడం వల్ల తమకు కష్టతరమవుతుందని, అందుకని కొత్త వాటిని కలపబోమని స్పష్టం చేసింది. "ఇప్పుడు పిటిషన్ల సంఖ్యను పెంచబోవడంలేదు. పెంచుకుంటూ వెళ్తే గుట్టలుగా పేరుకుపోతాయి. దాని వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం పేర్కొంది. అయితే వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేసేందుకు అదనపు కారణాలు ఉంటే ప్రధాన పిటిషన్లో జోక్యం చేసుకోవచ్చని ఫిరోజ్ ఇక్బాల్ ఖాన్, ఇమ్రాన్ ప్రతాప్‌గఢి, షేక్ మునీర్ అహ్మద్, ముస్లిం న్యాయవాదుల సంఘానికి సూచించింది.

# ఉగ్రవాదం అణచివేతలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

- సైన్యం నిర్ణయం మేరకు ఆపరేషన్ నిర్వహణ
- భారత సైన్యం శక్తి సామర్థ్యాలపై అపార నమ్మకం
- ఉన్నతస్థాయి సమీక్షలో ప్రధాని మోడీ విస్పష్ట ప్రకటన



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 :** ఉగ్రవాదాన్ని అణిచివేసే విషయంలో సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్టు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆపరేషన్ నిర్వహణ, సమయం, తేదీ, టార్గెట్‌లను సైన్యమే నిర్ణయిస్తుందని, భారత దళాల సామర్థంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. పహల్గాం దాడి అనంతర పరిణామాలు, భద్రత, సన్నద్ధతపై ప్రధానమంత్రి తన నివాసంలో మంగళవారం సాయంత్రం కీలక సమావేశం నిర్వహించారు. సుమారు గంటన్నర సేపు ఈ సమావేశం జరిగింది. పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు దారుణ మారణహోమానికి పాల్పడి వారం రోజులు పూర్తయింది. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు మృత్యువాత పడ్డారు. ఈ దాడి తర్వాత కేంద్రం పాకిస్థాన్‌కు బుద్ధి వచ్చేలా పలు నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసంలో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాద నిర్మూలనకు దృఢచిత్తంతో ఉన్నమని ప్రధాని తెలిపారు. ఉగ్రవాదాన్ని అణిచివేయడం జాతీయ సంకల్పం అని ఆయన అన్నారు. సాయుధ దళాల సామర్థంపై పూర్తి విశ్వాసం ఉందని ఆయన తెలిపారు. తీవ్రవాదం అణిచివేయడంలో, అందుకు తగిన కార్యాచరణ రూపొందించుకోవడంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎప్పుడు, ఎలా స్పందించాలో నిర్ణయం తీసుకొనే స్వేచ్ఛ పూర్తిగా సైన్యానిదే అని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని అధ్యక్షతన ఈ సమావేశం దాదాపు గంటన్నరపాటు- కొనసాగింది. ఈ సమావేశంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ పాటు- వివిధ దళాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉగ్రవాదాన్ని అణచివేయాలనేదే దేశ సంకల్పమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు.చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ సహా త్రివిధ దళాల అధిపతులతో ఉన్నత స్థాయి సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశంలో అంతర్గత భద్రత, సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని మోదీ తన నివాసంలో కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌ను ప్రస్తావించిన ప్రధాని మోదీ.. ఉగ్రవాదులు, వారిని పెంచి పోషిస్తున్న వారిని పాతాళంలో తొక్కేస్తామని స్పష్టం చేసినట్లు- తెలుస్తోంది. అంతేకాదు, వారి ఊహకందని రీతిలో చర్యలు ఉంటాయని చెప్పినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రఘటనకు ప్రతీకార దాడులు తప్పవని ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ ప్రధాని మోదీ మాటలు వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. మరోవైపు భద్రతారంగ కేబినెట్ కమిటీ బుధవారం సమావేశం కానుంది. వారం రోజుల వ్యవధిలో భేటీ కానుండటం రెండోసారి. అనంతరం మోదీ నేతృత్వంలో రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ- సమావేశం కానుందని సమాచారం. ఇందులో సీసీఎస్‌లోని ఐదుగురు సభ్యులతో పాటు- రవాణా, ఆరోగ్య, వ్యవసాయ, రైల్వే మంత్రులు ఉన్నారు. ఇలా కీలక భేటీ-లు జరిగే ఒకరోజు ముందే త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని మోదీ సమావేశం ఏర్పాటు- చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉంటే, 2016లో ఉరిలో ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వెంబడి భారత సైన్యం మెరుపుదాడులు చేసింది. అనంతరం 2019లో సీఆర్పీఎఫ్ బలగాలే లక్ష్యంగా పుల్వామాలో జరిగిన దాడి అనంతరం భారత సైన్యం సర్జికల్ స్ట్రయిక్స్ చేపట్టిన సంగతి తెలిసిందే.

## బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే యుద్ధమే : కృష్ణయ్య



**హైదరాబాద్, ఏప్రిల్ 29 :** బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే జరగబోయేది రాష్ట్ర ప్రభుత్వంతో యుద్ధమేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. మంత్రులు, ఎమ్మెల్యేలను రోడ్లపై తిరగనీయమని, వెయ్యి మందితో రాష్ట్రవ్యాప్తంగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ కాచిగూడలోని ఓ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో '42 శాతం బీసీ రిజర్వేషన్లు.. భవిష్యత్తు కార్యాచరణ' అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. "గతంలో ఏ సీఎం చేయని విధంగా రేవంత్‌రెడ్డి బీసీ ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేసే సాహసానికి పాల్పడుతున్నారు. ఆయా రంగాలకు చెందిన ప్రముఖులకు ప్రాతినిధ్యం కల్పించకుండా రాష్ట్ర సమాచార కమిషన్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారు. వెంటనే ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలి" అని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ డా.వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బీసీ సంఘాల నేతలు నీల వెంకటేశ్, జ్ఞానేశ్వర్, రాజేందర్, గౌరిగె మల్లేశ్, నరేందర్, సూర్యనారాయణ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## బిజెపి, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు

- కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికలో అవినీతి ప్రస్తావన లేదు
- ఉత్తమ్ వ్యాఖ్యలను ఖండించిన మాజీమంత్రి హరీష రావు

**హైదరాబాద్, ఏప్రిల్ 29 :** కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక మీద నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ మాట్లాడినవన్నీ అబద్ధాలేనని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మేడిగడ్డలో అవినీతి జరిగిందని ఎన్డీఎస్ఏ ఎక్కడా చెప్పలేదన్నారు. రాష్ట్రమంతటా బీఆర్ఎస్ రజతోత్సవ సభ, కేసీఆర్ ప్రసంగంపై చర్చ జరుగుతోందనే అక్కసుతో ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్డీఎస్ఏ ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగామారిందని హరీశ్‌రావు ఆక్షేపించారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై హరీశ్‌రావు స్పందించారు. ఈ సందర్భంగా పలువురు నేతలతో కలిసి ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతలకు డీపీఆర్ ఉందా? డీపీఆర్ లేకుండానే కొడంగల్ ఎత్తిపోతల పనులు ప్రారంభించారు. పోలవరంలో డయాఫ్రమ్ వాల్ కొట్టు-కుపోతే ఎన్డీఎస్ఏ ఎందుకు మాట్లాడలేదు? పోలవరానికి ఎందుకు పోలేదు? ఎందుకు నివేదిక ఇవ్వలేదు? ఎన్డీఎస్ఏ అనేది ఎన్డీయే ప్రభుత్వ జేబు సంస్థగా మారింది. కాంగ్రెస్, భాజపా కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు.

## నైపుణ్య శిక్షణకు రాష్ట్రంలో ఆస్ట్రేలియా వర్సిటీ!

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో ప్రతినిధుల చర్చ



**హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో నైపుణ్య శిక్షణ అందించే యూనివర్సిటీ ఏర్పాటుకు ఆస్ట్రేలియా వాణిజ్య ప్రతినిధులు ముందుకు వచ్చారని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నెలకొల్పుతున్న యంగ్ ఇండియా స్కిల్స్ విశ్వవిద్యాలయానికి తోడు మరో ఉన్నతస్థాయి టెక్నాలజీ క్యాంపస్ అందుబాటులోకి వస్తే యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని ఆయన అన్నారు. మంగళవారం సచివాలయంలో తనను కలిసిన ఆస్ట్రేలియా ప్రతినిధులతో శ్రీధర్‌బాబు చర్చించారు. కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్నందున గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)లలో పనిచేస్తున్న 3 లక్షల మందికి పైగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లతో పాటు, చదువులు పూర్తిచేసుకునే విద్యార్థులకు నూతన నైపుణ్యాలపై శిక్షణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. "తమ యూనివర్సిటీ ద్వారా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు సృష్టిస్తామని ఆస్ట్రేలియా ప్రతినిధులు చెబుతున్నారు. శాటిలైట్ల నిర్మాణం, డ్రోన్ టెక్నాలజీ, 3-డి డిజైనింగ్, బయో సైన్సెస్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ తదితర రంగాల్లో శిక్షణ అందించడానికి ప్రణాళిక సిద్ధం చేశామని వారు చెప్పారు. స్పష్టమైన, నిర్దిష్ట ప్రతిపాదనలతో రావాలని వారికి సూచించాం" అని శ్రీధర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.




## అవి పట్టా భూములే..

- భూదాన్ భూములంటూ.. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయండి
- హైకోర్టులో ఐపీఎస్‌ల అప్పీళ్లు.. నేడు విచారణ

**హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలోని సర్వే నంబర్ 194లో తాము కొనుగోలు చేసిన భూములు భూదాన్‌వి కాదని, పట్టా భూములేనంటూ పలువురు ఐపీఎస్‌లు హైకోర్టుకు నివేదించారు. ఈ సర్వే నంబరులో 16, 20, 18 గుంటల విస్తీర్ణాలతో కొనుగోలు చేశామన్నారు. దీనికి సంబంధించిన విక్రయ ఒప్పందపత్రాలు కూడా ఉన్నాయని తెలిపారు. నాగారం గ్రామంలో సర్వే నం.181, 182, 194, 195లలో భూదాన్ భూములకు సంబంధించి పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్‌లతో సహా ఉన్నతాధికారుల పాత్రపై ఆరోపణల నేపథ్యంలో ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చాలంటూ సింగిల్ జడ్జి ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను పలువురు అధికారులు తాజాగా సవాల్ చేశారు. ఈ మేరకు ఐపీఎస్‌లు రవిగుప్తా, తరుణ్‌జోషి, బి.కె.రాహుల్ హెగ్డే, జితేందర్ కుమార్ గోయల్ భార్య రేణుగోయల్, ఐఏఎస్ జనార్దన్‌రెడ్డి కుమారుడు రాహుల్ బుసిరెడ్డి, ఐపీఎస్‌లు మహేశ్ భగవత్, సౌమ్య మిశ్ర, స్వాతి లక్రా, ఉమేశ్ షరాఫ్ భార్య రేఖ షరాఫ్‌లతోపాటు ప్రైవేటు వ్యక్తి వీరన్నగారి గౌతంరెడ్డి హైకోర్టులో వేర్వేరుగా 4 అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టనుంది.

### 'భూదాన్ జాబితాలో 194 సర్వే నంబరు లేదు'

నాగారం గ్రామంలోని భూదాన్ భూముల్లో అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులకు ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో సీబీఐ, ఈడీలతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ మహేశ్వరం మండలానికి చెందిన బిర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ప్రతివాదులైన ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, పలువురు ప్రైవేటు వ్యక్తులకు నోటీసులు జారీ చేయడంతోపాటు సర్వే నం.181, 182, 194, 195లోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలంటూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. తమతోపాటు భూమి యజమానులకు నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోకుండానే సింగిల్ జడ్జి ఏకపక్షంగా ఉత్తర్వులు జారీ చేశారంటూ అప్పీలుదారులు పేర్కొన్నారు. తాను అధికారులకు సమర్పించిన వినతిపత్రాలపై దర్యాప్తునకు సంబంధించి నివేదికలు తెప్పించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ అభ్యర్థించారని, అయితే దీనికి మించి ఉపశమనం కలిగిస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. 194, 195 సర్వే నంబర్లలో 30 ఎకరాలుండగా, అందులోని భూములను కొనుగోలు చేశామన్నారు. భూదాన్ భూములను ప్రైవేటు భూములుగా మార్చారన్న ఆరోపణలు అవాస్తవమన్నారు. 2023 నవంబరులో తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు జారీ చేసిన ప్రొసీడింగ్స్‌లో.. సర్వే నం.181లోని 50 ఎకరాలను భూదాన్ భూమిగా పేర్కొందన్నారు. బోర్డు పేర్కొన్న జాబితాలో సర్వే నం.194 లేదన్నారు. 2019 ఫిబ్రవరిలో సర్వే నం.194, 195ల్లోని (సర్వే నం.195/2లో 95.25 ఎకరాలు మినహా) భూములను పట్టా భూములుగా పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేశారన్నారు. పిటిషనర్ ఈ ప్రొసీడింగ్స్‌కు సంబంధించిన పత్రాలను సింగిల్ జడ్జికి సమర్పించలేదన్నారు. ఈ భూమికి సంబంధించి పిటిషనర్ మల్లేశ్ తల్లి కూడా కొన్ని విక్రయ ఒప్పందాలు చేశారని పేర్కొన్నారు.

## తొలిరోజు ఎప్‌సెట్‌కు 93 శాతం హాజరు

**హైదరాబాద్:** రాష్ట్రంలో ఎప్‌సెట్ అగ్రికల్చర్-ఫార్మసీ విభాగం పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రెండు విడతల్లో మొత్తం 57,664 మందికిగాను 53,705 మంది(93 శాతం) హాజరయ్యారు. జేఎన్‌టీయూహెచ్‌లో ఉదయం ప్రశ్నపత్రాల కోడ్‌ను నిర్ణయించే క్రతువులో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి టి.కిషన్ కుమార్‌రెడ్డి, రెక్టార్ కె.విజయకుమార్‌రెడ్డి, విద్యామండలి కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేష్, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు, కన్వీనర్ డీన్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం సీఎంఆర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని బాలకిష్టారెడ్డి తనిఖీ చేశారు.

## నేడు.. రేపు ఓ మోస్తరు వర్షాలు

**హైదరాబాద్:** రాష్ట్రంలో బుధ, గురువారాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబా బాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షాలు పడతాయని పేర్కొంది. గురువారం కూడా పైన పేర్కొన్న ప్రాంతాలతోపాటు మరికొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయంది.



## బదిలీలు, పదోన్నతుల్లో న్యాయం చేయండి

**హైదరాబాద్:** పురపాలకశాఖలో ఉద్యోగుల పదోన్నతులు, బదిలీల్లో న్యాయం చేయాలని కోరుతూ తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల కేంద్ర సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షులు ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటగోపాల్, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసగౌడ్ మంగళవారం హైదరాబాద్‌లో పురపాలకశాఖ కార్యదర్శి టి.కె.శ్రీదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పురపాలకశాఖలోని మేనేజర్లు, రెవెన్యూ ఉద్యోగుల పదోన్నతులు, బదిలీల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని, త్వరలో చేపట్టనున్న మున్సిపల్ కమిషనర్ కేటగిరీ-3 పదోన్నతులు ఆపాలని కోరుతూ సంఘం తరఫున హైకోర్టును ఆశ్రయించామని పేర్కొన్నారు. న్యాయస్థానం తదుపరి విచారణను జూన్ 24కు వాయిదా వేసిందని, అప్పటి వరకూ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ నిలిపివేయాలని ఆ వినతిపత్రంలో కోరారు.

# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- ఆదివాసీల ప్రయోజనాలకు విఘాతం కలిగించొద్దు
- మంత్రి సీతక్క డిమాండ్



**వరంగల్, ఏప్రిల్ 29 :** ఆదివాసీల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలన్నారు. మావోయిస్టు పార్టీలను సమూలంగా అంతమొందించడమే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌పై మంత్రి సీతక్క స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ, చత్తీస్‌గడ్ సరిహద్దుల్లో శాంతియుత వాతావరణం నెలకొనాలని అన్నారు. మధ్యభారతంలోని ఆదివాసి ప్రాంతాలు రాజ్యాంగంలోని షెడ్యూల్ 5 పరిధిలోకి వస్తాయని తెలిపారు. అక్కడ ఆదివాసీలకు ప్రత్యేక హక్కులుంటాయన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో ప్రత్యేక పరిపాలన విధానాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. అందుకే ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి వారి శాంతియుత జీవన విధానానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలని సూచించారు. బల ప్రయోగంతో కాకుండా, చర్చల ద్వారా సమస్య పరిష్కారం జరిగేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని ఆదివాసి బిడ్డగా కోరుకుంటు-న్నానని తెలిపారు. ఆదివాసీల హక్కులను ఎవరూ కాలరాయవద్దన్నారు. ఆ జాతి బిడ్డగా ఆదివాసులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలు తీవ్ర భయాందోళనతో ఉన్నారన్నారు. మావోయిస్టుల శాంతి చర్చల ప్రతిపాదనకు కేంద్రం సానుకూలంగా స్పందించాలని కోరారు. రెండు వైపుల ప్రాణ నష్ట నివారణకు శాంతి చర్చలు మార్గం చూపుతాయని అన్నారు. కాగా.. మంత్రి సీతక్కను పీఎస్ కమిటీ- బృందం కలిసింది. కాగా.. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టలపై ఎనిమిదవ రోజు భద్రతా బలగాల కుంబింగ్ కొనసాగుతోంది. హెలికాప్టర్ ద్వారా కర్రెగుట్టలపైకి భారీగా బలగాలు చేరుకుంటున్నాయి. కర్రెగుట్టలపై తాత్కాలిక బేస్ క్యాంపు ఏర్పాటు- చేస్తున్నట్లు- సమాచారం. బేస్ క్యాంప్ కోసమే బలగాలు, ఆయుధ సామాగ్రిని హెలికాప్టర్ ద్వారా భద్రతా బలగాలు తరలిస్తున్నాయి. ఆపరేషన్ కర్రెగుట్టలపై కేంద్రం ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. ఛత్తీస్‌గఢ్, కేంద్ర ప్రభుత్వాల సమన్వయంతో కేంద్ర బలగాలు, ఛత్తీస్‌గఢ్ బలగాలు గత వారం రోజులుగా కూంబింగ్ కొనసాగుతోంది. ఆపరేషన్ కర్రెగుట్టలు నిలిపివేయాలని ఓ వైపు ప్రజాసంఘాలు, పౌరహక్కుల నేతలు డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితి. అటు- మావోయిస్టులు కూడా ఇప్పటికే మూడు నాలుగు సార్లు లేఖలు రాసినప్పటికీ కేంద్రం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. అంతేకాకుండా కర్రెగుట్టలపై బేస్ క్యాంప్‌ను ఏర్పాటు- చేస్తున్నట్లు- తెలుస్తోంది. ఈరోజు ఒక్కరోజే వెంకటాపురం సీఆర్పీఎఫ్ క్యాంపు నుంచి కర్రెగుట్టలపైకి రెండు హెలికాప్టర్లు నాలుగు సార్లు అక్కడకు వెళ్లి బలగాలు, మందుగుండు సామాగ్రిని తరలించాయి. ఇటీ-వల వడదెబ్బ కారణంగా 40 మంది జవాన్లు వెనక్కి వచ్చినప్పటికీ రెట్టింపు సంఖ్యలో బలగాలను చేరవేస్తూ కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.

## తెలంగాణకు ఎప్పటికి కాంగ్రెస్ పార్టీనే విలన్

- ఎంత ధాన్యం కొన్నారో లెక్కలు చెప్పండి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి విమర్శలు



**సూర్యాపేట, ఏప్రిల్ 29 :** తెలంగాణకు ఎప్పటికి కాంగ్రెస్ పార్టీనే విలన్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేరు విలన్ గానే తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుంది.. 16 నెలల్లో సమైక్య రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు వచ్చాయని ఆరోపించారు. ఒక్క ఏడాదిలోనే గురుకుల పాఠశాలల్లో 90 మంది విద్యార్థులు చనిపోయారు అని చెప్పుకొచ్చారు. ఇక, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్తర కుమార ప్రగల్భాలు ఆపాలని సూచించారు. ఈ రోజు వరకు ఎంత ధాన్యం కొన్నారో ఉత్తమ్ కుమార్ లెక్క చెప్పాలి అని డిమాండ్ చేశారు. ఎన్ని వడ్లు కొన్నారు?.. ఎంత బోనస్ ఇచ్చారో చెప్పాలన్నారు. చెప్పకపోతే మీరు రండలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మీద ఎందుకు ఏడుస్తున్నారు.. కేసీఆర్ మీకు సంవత్సరం పైనే సమయం ఇచ్చారని జగదీష్ రెడ్డి తెలిపారు. ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభపై ప్రజల్లో చర్చ జరుగుతోంది అని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తెలిపారు. ఇక, సభకు వచ్చిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు.. బహిరంగ సభలో రేవంత్ రెడ్డి పేరు కేసీఆర్ చెప్పలేదని సీఎం బాధపడుతున్నారనిఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ ని కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు గుర్తు పెట్టుకోవడం లేదని సెటైర్లు.. ఇక, తెలంగాణను ఆంధ్రాలో కలిపింది కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ పేరు ఎత్తితే వాళ్ళను నక్సలైట్ల పేరుతో కాంగ్రెస్ కాల్చి చంపింది అని గుర్తు చేశారు. చంద్రబాబు చేతిలో నడ్డి విరిగిన కాంగ్రెస్ 2004లో టీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకుంది.. యూపీఏ కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును టీఆర్ఎస్ పెట్టించింది.. కేసీఆర్ తిడుతున్న వాళ్ళు నాడు సమైక్యాంధ్ర తొత్తుల కింద ఉన్నారు అని జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్‌డిఎస్ఎ ఇచ్చిన రిపోర్ట్ నిజమని నిరూపించు ఉత్తమ్ కుమార్ రెడ్డి మాజీమంత్రి జగదీష్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ తెలంగాణకు వస్తే ఎవరూ పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఏం మాట్లాడుతారోనని మీరు, ప్రజలు ఎదురు చూశారు.. అసెంబ్లీలో పిల్లల్ని ఏం పీకలేకపోతున్నారు.. అవతలి టీమ్ బలహీనంగా ఉందని పిల్లల్ని అసెంబ్లీకి పంపుతున్నారు.. కేసీఆర్ ఏ టైంకి, ఎట్లా రావాలో అసెంబ్లీకి వస్తారు.. ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని జీవో ఇచ్చారు.. 41 వేల కోట్లు రుణమాఫీ అని చెప్పి 21 వేల కోట్లు చేశామని చెప్పారు.. ఇప్పుడు రైతు రుణమాఫీ పూర్తి అయిందని అంటున్నారు.. బీఆర్ఎస్ సభను చూసి లాగులు తడుపుకుంటున్నారని సెటైర్లు వేశారు.

## నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, ఏప్రిల్ 29 :** తెలంగాణ పదో తరగతి ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ సారి కొత్తగా మార్కులతో పాటు- సబ్జెక్టుల వారీగా గ్రేడ్స్ ప్రకటించనున్నారు. ఆ విధంగానే మార్క్స్ మెమోలు జారీ కానున్నాయి. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగిన పది పరీక్షలకు 5 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. విడుదలయిన పదో తరగతి ఫలితాలను వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. ఇక నుంచి పదో తరగతి మెమోల్లో సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లు ఇవ్వనున్నారు. జీపీఏ అనేది తీసివేయనున్నారు. మార్కుల మెమోలపై సబ్జెక్టులవారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ పరీక్షల మార్కులు, మొత్తం మార్కులు, గ్రేడు పొందుపరచనున్నారు. చివరగా విద్యార్థి పాసయ్యారా? ఫెయిల్ అయ్యారా? అనేది వివరంగా ఇస్తారు. ఇంకా బోధనేతర కార్యక్రమంలో స్టూడెంట్స్‌కు గ్రేడ్లు ఇస్తారు. వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ ఎడ్యుకేషన్, వర్క్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఆర్ట్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ అనే నాలుగు కో కరిక్యులర్ యాక్టివిటీస్‌కు సంబంధించిన గ్రేడ్లు కూడా ముద్రిస్తారు.

## హైదరాబాద్‌ను వీడిన నలుగురు పాక్ జాతీయులు

### దుబాయ్ మీదుగా పాక్‌కు పయనం

**హైదరాబాద్, ఏప్రిల్ 29 :** పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ వాసుల వీసాలు రద్దు చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకోవడంతో పాటు, వారు వెంటనే దేశం విడిచి వెళ్లాలని ఆదేశించడంతో హైదరాబాద్‌లో ఉన్నవారు తిరుగు ప్రయాణం కట్టారు. భారత్‌లో ఉన్న పాకిస్థాన్ పౌరులు దేశాన్ని విడిచి వెళ్లేందుకు మంగళవారం చివరి రోజు కావడంతో పాకిస్థానీలు దేశం విడిచి హుటాహుటిన తమ దేశానికి పయనమయ్యారు. అలాగే హైదరాబాద్‌లో ఉన్న పాకిస్థాన్ వాసులను గుర్తించిన పోలీసులు.. వారు వెంటనే నగరం విడిచి పెట్టిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో పాకిస్థానీలు హైదరాబాద్‌ను వీడుతున్నారు. తాజాగా నలుగురు పాకిస్థానీలు హైదరాబాద్‌ను వీడి పాకిస్థాన్‌కు వెళ్లిపోయారు. ఆ నలుగురిలో ఒక పురుషుడు, ఇద్దరు స్త్రీలు, మరో బాలుడు ఉన్నారు. వీరంతా కూడా శంషాబాద్ విమానాశ్రయం నుంచి దుబాయ్ మీదగా పాకిస్థాన్‌కు వెళ్లిపోయారు. నలుగురు పాకిస్తానీలు ఆదివారమే హైదరాబాద్ నుంచి వెళ్ళిపోయారు. తెలంగాణలో మరికొంత పాకిస్తానీలకు సంబంధించిన డాక్యుమెంట్లను పోలీసులు వెరిఫై చేస్తున్నారు. పాకిస్థానీలకు గడువు ముగింపు ఉండటంతో నిన్నటి వరకు నలుగురు పాకిస్థానీలు వెళ్ళిపోయినట్టు అధికారులు చెబుతున్నారు. కాగా.. కేంద్రం ఆదేశాలతో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ మూడు కమిషనరేట్‌లో మొత్తం 213 మంది పాకిస్థానీలు ఉన్నట్లు- పోలీసులు గుర్తించారు. అయితే వీరిలో నలుగురు షార్ట్ టర్మ్ వీసాపై ఉన్నారని, మిగిలిన వారందరికీ లాంగ్ టర్మ్ వీసాలు కలిగి ఉన్నట్లు- తెలుస్తోంది. అయితే లాంగ్ టర్మ్ వీసాలు కలిగిన పాకిస్తానీలకు కేంద్రం మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో షార్ట్ టర్మ్ వీసా ఉన్న నలుగురు పాకిస్థానీలను దేశం విడిచి వెళ్లాల్సిందిగా హైదరాబాద్ పోలీసులు నోటీ-సులు జారీ చేశారు. గడువులోపు దేశం విడిచి వెళ్లని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరికాలు జారీ చేశారు. ఈ క్రమంలో నలుగురు పాకిస్థానీలు దేశం విడిచి వెళ్లిపోయారు. అయితే పాకిస్థాన్ పౌరులు దేశం విడిచి వెళ్లేందుకు ఏప్రిల్ 29 వరకు కేంద్ర ప్రభుత్వం డెడ్‌లైన్ విధించిన విషయం తెలిసిందే. మెడికల్ పరంగా వచ్చిన వారికి కూడా ఈరోజు వరకు గడువు విధించారు. కేంద్రం ఆదేశాల నేపథ్యంలో దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అలర్ట్ అయి.. పాకిస్థానీలను గుర్తించి వారిని దేశం విడిచి వెళ్లాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. దీంతో నేటితో గడువు ముగియనుండటంతో ఇప్పటికే అనేక మంది పాకిస్థానీలు తమ దేశానికి తిరుగుముఖం పట్టారు.

## అఖిలపక్షానికి రాకుండా ఎన్నికల ప్రచారానికా?

### మోడీ తీరుపై మండిపడ్డ జైరామ్ రమేశ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 :** పహల్గాం ఉగ్రదాడిపై అఖిల పక్ష సమావేశానికి ప్రధాని మోడీ గైర్హాజరు కావడంపై కాంగ్రెస్ ఎంపి జైరాం రమేష్ మండిపడ్డారు. రాబోయే బీహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గనేందుకు ప్రధాని మోడీకి సమయం ఉంది, కానీ అఖిలపక్ష సమావేశానికి హాజరయ్యేందుకు సమయం లేదని ఎద్దేవా చేశారు. బాధ్యత వహించాల్సి సమయంలో ప్రధాని మోడీ 'గాయబ్' అయ్యారని అంటూ ఆయన సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిపై ఏప్రిల్ 22న అఖిల పక్షం నిర్వహించాలని డిమాండ్ చేశామని అన్నారు. ప్రధాని విదేశీ పర్యటన నుండి తిరిగి వచ్చారు కానీ, బీహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లారని అన్నారు. ప్రధానికి బీహార్ ఎన్నికల పచారంలో ప్రసంగించేందుకు సమయం ఉంది కాని అఖిలపక్ష సమావేశంలో ప్రసంగించేందుకు సమయం లేదని అన్నారు. పార్లమెంట్ ప్రత్యేక సెషన్ నిర్వహించాలని, దీనిలో అంశంపై రాజకీయ ఎజెండా లేదని అన్నారు. మనమంతా ఐక్యంగా ఉన్నామని ప్రపంచానికి చూపించడానికి, ఐక్యంగా ఉండాల్సిన సమయమిదని అన్నారు. పహల్గాం ఉగ్రదాడిపై పార్లమెంట్ ప్రత్యేక సెషన్ నిర్వహించాలని కోరుతూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేలు సోమవారం ప్రధాని మోడీ లేఖ రాశారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ప్రతి భారతీయుడిని ఆగ్రహానికి గురిచేసింది. ఈ క్లిష్ట సమంయలో,. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మనమంతా ఐక్యంగా ఉంటామని భారతదేశం చూపాల్సి వుందని లేఖలో పేర్కొన్నారు. ప్రతిపాదిత పార్లమెంట్ సెషన్ దాడిపై ఉమ్మడి వైఖరిని వ్యక్తీకరించడానికి ఒక వేదికగా ఉంటుందని, పరిస్థితిని ఎదుర్కొనే సమిష్టి సంకల్పాన్ని ప్రదర్శిస్తుందని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు. ఐక్యత, సంఘీభావంపపై ప్రతిపక్షాల నమ్మకాలు ఈతరుణంలో అత్యవసరమని గుర్తించారు.

## దేశానికి రోల్ మోడల్‌గా భూ భారతి

- రాష్ట్రంలో భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం
- భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి



**వరంగల్, ఏప్రిల్ 29 :** దేశానికి రోల్ మోడల్‌గా భూ భారతి నిలుస్తుందని రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కార మార్గం చూపాలన్న సంకల్పంతో ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ చట్టాన్ని తెచ్చిందని అన్నారు. ఈ చట్టం రైతులకు శ్రీరామరక్ష అని అన్నారు. భూ భారతి 2025 చట్టంపై మంగళవారం వరంగల్ నగరంలోని నాని గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ ప్రారంభానికి ముందు తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం భూ భారతి చట్టంపై ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. చట్టంలోని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించి అందులోని అంశాలను జిల్లా కలెక్టర్ వివరించారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ధరణి వల్ల రైతుల వారసత్వంగా వచ్చే భూమిని అనుభవించలేక అనేక సమస్యలు ఏర్పడ్డాయని, వాటి చిక్కుముడి విప్పడానికే భూ భారతి దోహదపడుతుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండంచల వ్యవస్థను తీసుకువచ్చినట్లు- తెలిపారు. సభలో రైతులు కొంగరి భాస్కరరావు, విజయ్ కుమార్, గోపాల రాధాకృష్ణ సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. భూ భారతి చట్టం ప్రజలకు అందినప్పుడు దానికి సార్థకత చేకూరుతుందని, అందుకు అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. రికార్డుల్లో తప్పుల సవరణ, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, భూముల సర్వే, మ్యాప్ తయారీ , పెండింగ్ సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో అధికారులు నిజాయితీగా పనిచేయాలని, లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వరంగల్ నగర పరిధిలోని 32వ డివిజన్ బిఆర్‌నగర్‌లో మంగళవారం సన్నబియ్యం లబ్ధిదారుడు సింగబోయిన అనిల్ కుమార్ ఎల్లమ్మ ఇంట్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, ఎంఎల్ఏ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ అశ్విని థానాజీ వాకడే భోజనం చేశారు. లబ్ధిదారులు అందించిన ఆతిథ్యానికి ముగ్ధులైన మంత్రులు అన్నదాత సుఖీభవ అంటూ కుటుంబ సభ్యులను శాలువతో సత్కరించి, నజరానా అందజేశారు.

## పర్యాటకరంగంలో బలమైనపునాది వేశా

### మరోమారు ట్వీట్ చేసిన స్మితా సబర్వాల్



**హైదరాబాద్, ఏప్రిల్ 29 :** ఇటీవల బదిలీ వేటుకు గురైన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ మరో సంచలన ట్వీట్ట్ చేశారు. భగవద్గీతలోని 'కర్మణ్యే వాధికారస్తే, మా ఫలేషు కదాచన' శ్లోకంతో ప్రారంభించి.. 'పర్యాటకంలో 4 నెలలు పనిచేశా. నా వంతు కృషి చేశాను!. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 25-30 పర్యాటక విధానాన్ని తీసుకువచ్చాను. ఇది రాష్ట్రానికి మొదటిసారి. నిర్లక్ష్యం చేయబడిన పర్యాటక ప్రాంతాలకు దిశను చూపేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు ఒక బలమైన పునాదిని సృష్టిస్తుంది. పర్యాటక శాఖ పని శైలిని పునరుద్ధరించాను. జవాబుదారీతనాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నించాను. లాజిస్టిక్స్ అండ్ ప్రణాళికకు పునాది వేశాను. ప్రపంచవ్యాప్త కార్యక్రమం కోసం.. ఇది ఖచ్చితంగా మరిన్నింటికి తలుపులు తెరుస్తుంది' అని స్మితా ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. కాగా, ప్రస్తుతం రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న స్మితా సబర్వాల్ పై రాష్ట్ర ప్రభుత్వం బదిలీ వేటు- వేసింది. ఆమెను ఫైనాన్స్ కమిషన్ కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పేలుడు

### ముగ్గురు కార్మికుల దుర్మరణం

**యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 29 :** జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. మోటకొండూరు మండలం కాటేపల్లి వద్ద ఉన్న ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి భవనం కుప్పకూలి పోయింది. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనస్థలానికి చేరుకొని అక్కడకు చేరుకొని పరిశీలిస్తున్నారు. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మోటకొండూరు మండలం లోని ప్రీమియర్ ఎక్స్ ఎలోజివ్ కంపెనీలో పేలుడు సంభవించింది. పేలుడు ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పేలుడు ధాటికి భవనం కుప్పకూలిపోయింది. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో పనిచేస్తున్న నలుగురు కార్మికులు గాయపడ్డారు. మరో ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు.. ఘటనా స్థలంలో ఇద్దరు మృతి చెందారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. శిథిలాల కింద ఇద్దరి మృతదేహాలు ఉన్నట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జేసీబీ సహాయంతో శిథిలాల్లో చిక్కుకున్న వారికోసం గాలింపు చేపట్టారు. కార్మికుల మృతితో గ్రామస్తులు కంపెనీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంపెనీ లోపలికి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి.

## గద్వాల జిల్లాలో రోడ్డు ప్రమాదం

### ఇద్దరు నర్సింగ్ విద్యార్థుల దుర్మరణం

**గద్వాల, ఏప్రిల్ 29 :** జోగుళాంబ గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు-చేసుకుంది. జిల్లా కేంద్రంలో నర్సింగ్ విద్యార్థులను బోలేరా వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఐదుగురు విద్యార్థినులకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడని వారిని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు- వైద్యులు తెలిపారు. నర్సింగ్ కాలేజ్ నుంచి హాస్టల్ కు వెళ్లే క్రమంలో బస్ పాయింట్ దగ్గర ఆగినప్పుడు ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. గద్వాల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నర్సింగ్ విద్యార్థినులు మృతి చెందడం పట్ల ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న అమ్మాయిలు, చిన్న వయసులోనే ఇలా మరణించడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సంతోష్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, మృతుల కుటుంబాలకు అండగా ఉండాలని వారికి సూచించారు. ఇదే ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న మరో విద్యార్థినికి అవసరమైన వైద్య సాయం అందించాలని కలెక్టర్‌ను, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. మృతుల కుటుంబాలకు మంత్రి సానుభూతి ప్రకటించారు. మరణించిన విద్యార్థినుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## రెండు కార్లు ఎదురెదురుగా ఢీ

### ఒకరు మృతి.. పలువురికి గాయాలు

**భద్రాచలం, ఏప్రిల్ 29 :** రెండు కార్లు ఎదురెదురుగా అతి వేగంతో ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురికి గాయాలు కాగా వారిలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..దక్షిణ కొరియా నుండి ఇండియా పర్యటనలో భాగంగా భద్రాచలం పరిసర ప్రాంతాలు సందర్శించేందుకు ముగ్గురు వ్యక్తులు ఒక గైడును వెంట బెట్టు-కొని కారులో భద్రాచలంనకు బయలుదేరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆళ్లపల్లి మండలానికి చెందిన వానపాకుల సాంబశివరావు హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ, నాలుగు రోజుల క్రితం బూర్గంపాడు మండలం, వేలేరులోని తమ బంధువుల ఇంట శుభకార్యానికి వచ్చాడు. అనంతరం తన భార్య శ్రీలత, మరదలు సంధ్య లతో కలిసి కారులో హైదరాబాద్ బయలుదేరాడు. అదే సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సరిహద్దు గ్రామమైన వినోభానగర్ సమీపంలో రెండు కార్లు అతివేగంతో ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. దీంతో రెండు కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. రెండు కార్లలో ప్రయాణిస్తున్న ఏడుగురికి గాయాలయ్యాయి. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్‌లు అందించిన సమాచారం మేరకు 108 వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుండి గాయపడిన దక్షిణ కొరియా వాసులు ఖమ్మంలోని సురక్ష హాస్పిటల్‌లో తక్షణ వైద్యం పొందుతుండగా, తీవ్రంగా గాయపడిన వానపాకుల సాంబశివరావు కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్

- 7వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు నిర్ణయం
- సమ్మె పోస్టర్ ఆవిష్కరించిన కార్మిక జేఏసి

**హైదరాబాద్, ఏప్రిల్ 29 :** తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. ఉద్యోగుల డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో మే 7వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేయాలని ఆర్టీసీ కార్మిక సంఘాలు నిర్ణయించాయి. ఈ సందర్భంగా సమ్మె సంబంధించిన పోస్టర్ ను ఆర్టీసీ కార్మిక జేఏసీ ఆవిష్కరించింది. మే డే స్ఫూర్తితో ఆర్టిసి సమ్మెకు సిద్ధం అయ్యింది. ప్రభుత్వం స్పందించి సమస్యల నివారణకు చర్యలు చేపట్టాలని, మా న్యాయమైన డిమాండ్ ల పై స్పందించాలని జేఏసీ నాయకులూ అన్నారు. ఇక సమ్మెకు ముందు ఆర్టిసి కార్మికులు మే 5 న కార్మిక కవాతు చేపడుతున్నామని, ఆర్టీసీ కళ్యాణ మండపం నుండి బస్సు భవన్ వరకు సమ్మెకు మద్దతుగా ఆర్టీసీ యూనిఫారంలో కవాతు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఇకపోతే, కొన్ని ఆర్టీసీ కార్మికుల సంఘాలు జేఏసీలోకి వస్తామని, మళ్లీ యాజమాన్యాలకు మద్దతుగా మాతో కలవడం లేదని.. యూనియన్ లకు అతీతంగా అందరూ సమ్మెకు కలిసి రావాలని పిలుపు ఇచ్చారు. ఆర్టీసీ విలీనాన్ని సీఎం చేపట్టాలని, ప్రజాపాలన చేయాలని కోరుతున్నట్లు- వారు పేర్కొన్నారు. ప్రైవేటీకరణ మూలమైన ఎలక్ట్రిక్ బస్సు లను ఆర్టీసీ యాజమాన్యం కొని నడపాలని, 2021 వేతన సవరణ చేపట్టాలని వారు కోరారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టిసి కార్మికులకు ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. 16 వేల మంది రిటైర్ అయిన ఖాళీలను భర్తీ చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేసారు.

## కర్రెగుట్ట చుట్టూ మందుపాతరలు

### ఆచితూచి అడుగేస్తున్న బలగాలు

**ములుగు, ఏప్రిల్ 29 :** తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో ఆపరేషన్ కగార్ కొనసాగుతోంది. ఎనిమిది రోజులుగా కేంద్ర బలగాలు కర్రెగుట్ట అడవులను తమ ఆధీనంలోకి తీసుకొని మావోయిస్టుల కోసం అన్వేషిస్తున్నాయి. వేలాది కేంద్ర బలగాలు సెర్చ్ ఆపరేషన్‌ను నిరంతరంగా చేపడుతున్నాయి. సుమారు వెయ్యి మంది మావోయిస్టులు కర్రెగుట్టల్లోని సొరంగాలలో ఉన్నారనే సమాచారం మేరకు కూంబింగ్ బలగాలు ఆ దిశగా వేట కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారని చత్తీస్‌గఢ్ పోలీసులు ధ్రువీకరించారు. అయితే, కర్రెగుట్టల చుట్టూ మావోయిస్టులు భారీగా మందు-పాతరలు అమర్చడంతో కూంబింగ్ ఆపరేషన్ ఆలస్యమవుతోందని తెలుస్తోంది. మావోయిస్టులు అమర్చిన సుమారు 100కు పైగా బాంబులను కేంద్ర బలగాలు నిర్వీర్యం చేసినట్లు- సమాచారం. మావో యిస్టులు బీరు బాంబులను సైతం అమర్చగా వాటిని చూసిన కేంద్ర బలగాలు ఆశ్చర్యం వ్యక్తం పరుస్తున్నట్లు- తెలుస్తోంది. కర్రెగుట్టల్లో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నట్లు- జోరుగా ప్రచారం జరుగుతుండటంతో కేంద్ర బలగాలు సెర్చ్ ఆపరేషన్‌ను మరింత ముమ్మరం చేశాయి. ఇదిలా ఉండగా కర్రెగుట్టల్లో కూంబింగ్ ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశాయి.

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# పాక్‌ను కోలుకోకుండా దెబ్బకొట్టాలి!



ముల్లును ముల్లుతోనే తీయాలి. కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నట్లుగా ఉండాలి. పాక్ ఏర్పడడమే మత ఛాందసవాందతో ఏర్పడింది. తాము భారత్‌ను చీల్చి ఏర్పడ్డామన్న జ్ఞానం వారిలో లేదు. అలాగే భారత్ భిక్షతో దేశంగా ఏర్పడ్డామన్న కృతజ్ఞత బంగ్లాదేశీయులకు లేదు. ఈ రెండు దేశాల్లో మిగిలిన అరకొర హిందువులను తన్ని తరిమేయడం..కశ్మీర్ సహా భారత్‌లో చిచ్చుపెట్టడం వీరి లక్ష్యంగా ఉంది. అది ఎప్పుడో రుజువయ్యింది. మనం శాంతి వచనాలు పలుకుతూ పోతే సమస్య పరిష్కారంకాదు. భారత్‌తో పెట్టుకుంటే అంతే సంగతులు అన్న విధంగా మన జవాబు ఉండాలి. రష్యా ఉక్రెయిన్‌పై దాడిచేసింది. ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు చేస్తూనే ఉంది. ఇలాంటి దెబ్బలు మనం కూడా కొట్టగలగాలి. నష్టం కలిగినా ఫర్వాలేదు. దేశాన్ని పటిష్టం చేసే క్రమంలో మనమంతా త్యాగాలకు సిద్ధపడాలి. ఈ దేశాన్ని వందలాది ఏళ్లుగా ఎందరో దాడులు చేసి ధ్వంసం చేశారు. మనలను బానిసలుగా మార్చారు. ఇవన్నీ మనకు గుణపాఠం కావాలి. ఇంకా దాడులను తట్టుకుంటూ పోదాం అన్న పద్దతి మాత్రం మంచిది కాదు. పహల్గాం దాడి జరిగి వారం రోజులు అవుతోంది. పాక్ నుంచి శిక్షణ పొందిన ముష్కరులే దాడికి కారణమని తేలింది. ముంబై దాడులు కావచ్చు..పుల్వామా దాడి కావచ్చు...పహల్గామ్ కావచ్చు.. అన్నీ పాక్ కుతంత్రాల వల్లనే జరిగిన ఘటనలు. అయినా దాయాది దేశానికి బుద్ది రావడం లేదు. పహల్గాం దాడిలో పాల్గొన్న నలుగురు ఉగ్రవాదుల్లో ఒకడైన హాషిమ్ మూసా పాక్ సైన్యంలో మాజీ పారా కమాండో అని దర్యాప్తులో తేలింది. దీనిని బట్టి పాక్ సైన్యంలో పనిచేసిన వారు ఆ తరవాత ఎలా ఉగ్రవాదులుగా మారుతున్నారో గమనించాలి. ప్రస్తుతం అతడు కరుడుగట్టిన టెర్రరిస్టుగా మారినట్లు దర్యాప్తు బృందాలు పేర్కొన్నాయి.

పాక్‌కు చెందిన లష్కరే తోయిబాతో కలిసి అతడు పని చేస్తున్నట్లు వెల్లడించాయి. ఆ సంస్థ మాస్టర్ మైండ్లే అతడిని కశ్మీర్‌కు పంపినట్లు- పేర్కొన్నాయి. ఇప్పటికే భారత సైన్యం ఉగ్రవాదులకు అనుకూలంగా పని చేస్తున్నారన్న అనుమానంతో వందల మంది స్థానికులను అదుపులోకి తీసుకొంది. వీరిలో 15 మంది ఉగ్రవాద ఓవర్ గ్రౌండ్ వర్కర్స్, మూసాకు ఉన్న సైనిక నేపథ్యాన్ని ధ్రువీకరించారని అధికారులు వెల్లడించారు. అతడు పాక్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ నుంచి లష్కరేలోకి సహాయకారిగా వచ్చినట్లు తెలుస్తోందని సైన్యం ధృవీకరించింది. ఇంతకన్నా ఆధారాలు ఇక అవసరం లేదు. కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ ఎత్తేసిన తరవాత అక్కడ శాంతి నెలకొనడమే గాకుండా స్థానికులకు ఉపాధి దక్కుతోంది. పర్యాటకం పెరిగింది. అక్కడి యువతలో కూడా మార్పు వచ్చింది. వారంతా జనజీవన స్రవంతిలో కలిసి పోతున్నారు. దీనిని విచ్ఛిన్నం చేసే పన్నాగమే ఉగ్రదాడి అని తేలింది. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఘటన అమాన వీయమైనదే కాదు.... మనిషన్నవాడు చేసే పని కాదు. ఇది కేవలం రాక్షస జాతి మాత్రమే చేస్తుంది. పాక్ పెంచి పోషిస్తున్న రాక్షసులు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇందుకుమనం కూడా సన్నద్దం కావాలి. మరణించిన వారి ఆత్మకు శాంతి జరగాలి. ఉగ్రమూకలను చీల్చి చెండాడం ద్వారా మన సత్తా చాటాలి. అలాగే కాశ్మీర్‌లో ఉంటూ...ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న కొందరు పాక్ సానుభూతిపరులను కూడా గుర్తించి కఠినంగా శిక్షించాలి. వారిని కూడా ఉగ్రదాడులకు బాధ్యులను చేయాలి. భూతల స్వర్గంగా భావిస్తున్న కశ్మీర్‌ను చూడాలని వెళ్లిన పర్యాటకులను హతమార్చిన ఘటనను ఇప్పటికీ భారతీయులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ నరమేధాన్ని ప్రపంచ దేశాలు అన్నీ తీవ్రంగా నిరసించాయి.

కేంద్ర ప్రభుత్వం ఇందుకు తగిన విధంగానే ప్రతిస్పందించింది. ఈ దుర్ఘటనకు కారణమైన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్‌ఎఫ్)ను, దానికి సహకారం అందించిన లష్కర్ ఎ తోయిబాను, దీనికి వెన్నుదన్నుగా ఉన్నదను కుంటున్న పాకిస్థాన్‌ను లక్షంగా చేసుకొని తక్షణ చర్యలు చేపట్టింది. తక్షణమే రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను రద్దు చేయడం, నీటి ఒప్పందాలను వెనక్కు తీసుకోవడంతోపాటు ఇంకా అనేక చర్యలు చేపట్టింది. సరిహద్దులను మూసివేయడం కూడా వెంటనే అమలు చేశారు. అదే విధంగా దాడికి బాధ్యులైన వారి లక్షంగా గాలింపు ముమ్మరం చేశారు. ఇవన్నీ ఊహించినవే అయినా సరిపోవని గుర్తించాలి. ప్రజల్లో వస్తున్న తీవ్ర నిరసన కారణంగా దాడులకు తక్షణ చర్యలు ఉండాలి. ఇప్పటికే కాశ్మీర్‌లో వేలాదిమంది పౌరులు, సైనికులు నేలకొరిగారు. వేలాదిమందిని హత్యలు చేశాలరు. లక్షల మందిని మత మార్పిళ్లు చేశారు. ఇవన్నీ గమనించిన తరవాతనే కేంద్రం 2019లో 370 ఆర్టికల్ రద్దు చేసి కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని ఎత్తేసింది. దీంతో సాధారణస్థితికి వచ్చి కాశ్మీర్ పర్యాటకంగా మళ్లీ చిగురించింది. దీనిని జీర్ణించుకోలేని పాక్ పాపాల భైరవులు దాడులకు తెగించారు. ఈ క్రమంలో అసవరమైతే యుద్ధం దాకా కూడా భారత ప్రభుత్వం వెళ్లవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఇక పాక్‌ను ఎంతమాత్రం నమ్మరాదు. పాముకు పాలుపోసి పెంచినట్లుగా మన గత పాలకులు పాక్ పాలకులకు చేయూతను ఇచ్చారు. అందువల్ల మనం ఎంతమాత్రం ఉపేక్షించరాదు. కష్టమైనా, నష్టమైనా దేశాన్ని ఏకతాటిపైకి తీసుకుని రావాలి. రాజకీయపార్టీలు కూడా విభేదాలు పక్కన పెట్టి పాక్‌కు గుణపాఠం చెప్పే ప్రయత్నాలకు బేషరతు మద్దతు పలకాలి. అలాగే పాక్ ఉనికినే ప్రశ్నార్థకం చేసేలా ప్రతీకార చర్యలు ఉండాలి. అప్పుడే భారత్‌కు శాంతి. గత కొన్నేళ్లుగా మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరుతుంది.

# నేడు కేబినేట్ భద్రతా వ్యవహారల భేటీ

- పహల్గామ్ ఘటన.. పరిణామాలపై చర్చ
- భారత్ గగనతలంపై పాక్‌కు నిషేధం విధించే ఛాన్స్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 :** పహల్గాం ఉగ్రదాడి ఘటన తర్వాత మరోమారు కేబినెట్ ఆన్ సెక్యూరిటీ బుధవారం సమావేశం కానుంది. బుధవారం ఉదయం 11.00 గంటలకు ప్రధాని మోడీ అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఏప్రిల్ 23న సమావేశమైన భద్రతా వ్యవహారాల కేబినెట్ పుల్వామా దాడిని ఖండించింది. సిసిఎస్ సమావేశం అనంతరం భారత్ పాకిస్థాన్‌తో దౌత్య సంబంధాల తగ్గింపుతో పాటు పలు చర్యలను చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దాడికి అనంతర పరిణామాలను కేబినేట్ చర్చించనుంది. అలాగే ఏదైనా ముఖ్య నిర్ణయాలపైనా చర్చించే అవకాశం ఉంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలోకేంద్ర ప్రభుత్వం వరుసగా కీలక భేటీలు నిర్వహిస్తోంది. దేశ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకునే క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ బుధవారం సమావేశం కానుంది. దీనికి ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షత వహించనున్నారు. ఘటన జరిగిన వెంటనే ఈ కమిటీ- ఒకసారి భేటీ- అయిన సంగతి తెలిసిందే. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన తొలిసారి గత బుధవారం దిల్లీలో జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నరమేధానికి పాల్పడిన ముష్కరులను శిక్షించడంతో పాటు వారిని ఎగదోస్తున్న శక్తులనూ బాధ్యులుగా నిలబెడతామంటూ పాకిస్థాన్‌ను గట్టిగా హెచ్చరించింది. సీమాంతర ఉగ్రవాదాన్ని వీడే వరకూ పాక్



పట్ల కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. దౌత్య సంబంధాల స్థాయినీ తగ్గించింది. సింధూ జలాల ఒప్పందం అమలును తక్షణమే నిలిపివేసింది. మరోవైపు సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయిన సంగతి తెలిసిందే. పహల్గాంలో పరిస్థితులతో పాటు- భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఇదిలావుంటే పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. తమపై ఆంక్షలు విధించిందనే అక్కసుతో భారత్‌పై పాకిస్థాన్ విషం చిమ్మింది. తమ గగనతలంపై మన దేశ విమానాల రాకపోకలపై నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో న్యూదిల్లీ కూడా దీనిపై ప్రతీకార చర్యలకు సిద్ధమైనట్లు- తెలుస్తోంది. పాక్ విమానయాన సంస్థలకు మన గగనతలాన్ని మూసివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇక, పాకిస్థానీ నౌకలు కూడా భారత పోర్టుల్లోకి రాకుండా నిషేధం విధించనున్నట్లు- తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఈ ప్రతిపాదన పరిశీలన దశలో ఉంది. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఓ అధికారి వెల్లడించినట్లు సమాచారం. ఒకవేళ దీనిపై భారత్ నిర్ణయం తీసుకుంటే.. అది పాక్ ఎయిర్‌లైన్లపై పెను ప్రభావం చూపించే అవకాశం ఉంది. పాక్ విమానాలు కౌలాలంపూర్ సహా మలేసియాలోని ఇతర నగరాలు, సింగపూర్, థాయ్‌లాండ్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే మన గగనతలాన్ని దాటాల్సిందే. ఇప్పుడు భారత్ నిషేధం విధిస్తే.. దక్షిణాసియా ప్రాంతాలకు వెళ్లేందుకు చైనా లేదా శ్రీలంక మీదుగా విమానాలను మళ్లించాల్సి ఉంటుంది. అప్పుడు ప్రయాణసమయం పెరగడంతో పాటు నిర్వహణ పైనా అదనపు భారం పడుతుంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకు పోయిన పాక్ ఎయిర్‌లైన్లకు ఇది మరింత శరాఘాతంగా మారనుంది. ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీ-వల మన విమానాలకు పాక్ తమ గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. దీంతో భారత ఎయిర్‌లైన్లు కూడా ప్రత్యామ్నాయ మార్గాల్లో విమానాలు నడుపుతున్నాయి. అయితే, ఈ నిర్ణయంతో ఆర్థికంగా మనకంటే పాక్‌కే ఎక్కువ నష్టం అని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటివరకు భారత్ నుంచి పాక్ గగనతలం మీదుగా వారానికి 800లకు పైగా అంతర్జాతీయ విమానాలు రాకపోకలు సాగించేవి. 2019లో పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో దాదాపు 5 నెలల పాటు- పాక్ తమ గగనతలంలో భారత విమానాలపై ఆంక్షలు విధించింది. దీంతో అప్పట్లో ఆ దేశం 100 మిలియన్ డాలర్ల పైగా నష్టపోయినట్లు సమాచారం.

# పెగాసస్ వ్యవహారంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు

- దేశ వ్యతిరేక శక్తుల కోసం ఉపయోగిస్తే తప్పేంటని ప్రశ్న
- పహల్గాం దాడులతో పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు
- పెగాసస్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం వెల్లడి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 :** దాదాపు నాలుగేళ్ల క్రితం దేశ రాజకీయాలను కుదిపేసిన పెగాసస్ వ్యవహారం పై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. దేశ వ్యతిరేక శక్తుల కోసం ఉపయోగిస్తే తప్పు లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ స్పైవేర్‌ను వినియోగించి దేశంలోని పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖులపై నిఘా పెట్టారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. జాతీయ భద్రతా ప్రయోజనాల కోసం ఓ దేశం స్పైవేర్‌ను కలిగి ఉండటం తప్పులేదని కోర్టు స్పష్టంచేసింది. అయితే,అది ఎలా,ఎవరిపై ఉపయోగిం చారన్న దాని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. పెగాసస్ ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం



విచారణ జరిపింది.ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. ప్రస్తుతం మన దేశం ఎలాంటి పరిస్థితిలో ఉందో అందరికీ తెలుసు. మనం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఇక, సాంకేతిక బృందం నివేదిక గురించి మాట్లాడుతూ.. దేశ భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన నివేదికను బహిర్గతం చేయడం సరికాదు. ఒకవేళ ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు దాని గురించి తెలుసుకోవాలనుకుంటే.. వారికి సమాచారం అందిస్తాం. అంతేగానీ.. వీధుల్లో చర్చించుకునే ఓ డాక్యుమెంట్‌గా ఈ నివేదిక మారకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈసందర్భంగా పిటిషన్ తరఫున న్యాయవాది మాట్లాడుతూ.. పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగిస్తోందా? లేదా అన్న విషయాన్ని కేంద్రం స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేగాక, ఈ ఆరోపణలపై దర్యాప్తు జరిపి సాంకేతిక నిపుణుల బృందం నివేదిక కోసం సర్వోన్నత న్యాయస్థానం గతంలో ఆదేశించిందని, ఇప్పటివరకూ ఆ నివేదిక అందలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దాన్ని వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. దీనికి ధర్మాసనం బదులిస్తూ.. దేశం స్పైవేర్‌ను వినియోగిస్తే గనుక అందులో తప్పేముంది. దేశ భద్రత విషయంలో రాజీపడకూడదు. ఒకవేళ సామాన్య పౌరులపై ఉపయోగిస్తే గనుక దాని గురించి మేం దర్యాప్తు జరిపిస్తాం. ఉగ్రవాదులు గోప్యత హక్కును కోరకూడదు. అయితే, సామాన్య పౌరుల గోప్యతకు మేం తప్పకుండా రక్షణ కల్పిస్తామని స్పష్టంచేసింది. ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్‌ఎస్‌వో గ్రూప్ అనే సంస్థ 'పెగాసస్' స్పైవేర్‌ని అభివృద్ధి చేసింది. నిఘా కార్యకలాపాల కోసం ఈ స్పైవేర్‌ను ఎన్‌ఎస్‌వో పలు ప్రభుత్వాలు, ప్రభుత్వ అధీనంలో పనిచేసే సంస్థలకు విక్రయిస్తుంటు-ంది. అయితే, ఈ పెగాసస్‌ను ఉపయోగించి పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖుల ఫోన్లను హ్యాక్ చేశారంటూ 2021లో ఓ అంతర్జాతీయ పత్రిక సంచలన కథనం ప్రచురించింది. భారత్ నుంచి 300 మంది ఫోన్లు హ్యాక్ అయినట్లు- పేర్కొంది. వీరిలో రాజకీయ ప్రముఖులు కూడా ఉన్నట్లు- తెలిపింది. దీంతో ఈ వివాదం దేశ రాజకీయాలను కుదిపేసింది. అనంతరం దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

# తిరుపతి మంగళంలో దారుణం

## భవనంపై నుంచి పడి ముగ్గురు కార్మికుల దుర్మరణం

**తిరుపతి, ఏప్రిల్ 29 :** నిర్మాణంలో ఉన్న భవనంపై నుండి ప్రమాదవశాత్తూ పడి ముగ్గురు కార్మికులు మృతి చెందిన ఘటన మంగళవారం తిరుపతి జిల్లాలో జరిగింది. మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ తుడా క్వార్టర్స్ హెచ్‌ఐజి ఫ్లాట్ నెంబర్ 63 లో 5 అంతస్తుల భవన నిర్మాణం జరుగుతుంది. భవన యజమాని అండాలయ్య జిపిఎస్ జీ ప్లస్ 3 కి అనుమతి తీసుకొని 5 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఉదయం నలుగురు మేస్త్రీలు భవనం 5వ అంతస్తు గోడకు పూత పని చేయడానికి వేసుకున్న బెడ్ కర్ర విరిగిపోవడంతో ఈ ప్రమాదం జరిగి ముగ్గురు కార్మికులు కిందికి పడిపోయి మరణించారు. విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ డిఎస్పి, ఆర్డీవో రామ్మోహన్, తిరుపతి అర్బన్ తాసిల్దార్ భాగ్యలక్ష్మి, సిఐ సునీల్ కుమార్, సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చనిపోయిన ముగ్గురు కార్మికులు ఒంగోలు



కు చెందిన వసంత్ (40), ఒంగోలు శీను (38), పెళ్ళకూరు మండలం, అక్క గారి పేట గ్రామం కు చెందిన బోటతొట్టి శ్రీనివాసులు (38) గా గుర్తించారు. 108 సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి కిందపడిన కార్మికులను పరిశీలించి వారు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కాశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులు

## ఇంటిలిజెన్స్ హెచ్చరికలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 :** జమ్ముకశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో ఉగ్రవాదులు సృష్టించిన మారణకాండలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భారత భద్రతా బలగాలు ఉగ్రవాదులను అంతం చేసే పనిలో నిమగ్నమై ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇంటెలిజన్స్ చేసిన ఓ హెచ్చరిక మరింత భయాందోళనకు గురి చేస్తోంది. పహల్‌గామ్ ఘటనను మరవక ముందే కశ్మీర్‌లో మరిన్ని ఉగ్రదాడులు జరిగే ప్రమాదం ఉందని ఇంటెలిజన్స్ హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో 50 పర్యాటక ప్రదేశాలను జమ్ముకశ్మీర్ ప్రభుత్వం మూసివేసింది. దీంతో పబ్లిక్ మార్కులు, గార్డెన్లు ఇతర పర్యటక ప్రదేశాలు మూతబడ్డాయి. అయితే ఇవి మళ్లీ ఎప్పుడు తిరిగి తెరుచుకుంటాయనే విషయంలో స్పష్టత లేదు. ఇంటెలిజన్స్ నుంచి హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# పహల్గాం దాడిపై పార్లమెంటులో చర్చిద్దాం

- సభలను అత్యవసరంగా సమావేశ పర్చండి
- ప్రధాని మోడీకి కాంగ్రెస్ అగ్రనేతల లేఖ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 29 :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో అత్యవసరంగా పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు ప్రధాని మంత్రి నరేంద్ర మోదీకి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేఖ రాశారు. అత్యవసరంగా పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని లేఖలో కోరారు. వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం ఎల్లప్పుడూ కలిసి నిలబడతామని చూపించాలని లేఖలో రాహుల్ కోరారు. పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మందికి నివాళులర్పించేందుకు సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా భారత పార్లమెంటు సాక్షిగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని లేఖలో తెలిపారు. కాగా.. పహల్గామ్ దాడి జరిగిన వెంటనే తర్వాతి రోజు సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం కూడా చేశారు. భారత ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలకు తాము మద్దతుగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ- సమావేశం నిర్ణయం తీసుకుంది. ఆ తరువాత జరిగిన అఖిల పక్ష సమావేశానికి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేతో పాటు అన్ని పార్టీల నేతలు హాజరయ్యారు. ఆ సమావేశంలో భారత ప్రభుత్వం చేపట్టే చర్యలన్నింటికీ మద్దతుగా ఉంటామని, వెంటనే చర్యలు చేపట్టాలని అన్నారు. అయితే ఆ సమావేశానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకాకపోవడాన్ని మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుబట్టారు. టు-వంటి ముఖ్యమైన సమావేశానికి ప్రధాని మోదీ వచ్చి అక్కడ జరిగిన సంఘటనలను వివరించి ఉంటే బాగుండేదని, ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రధాని మోదీ పార్లమెంటు- సమావేశాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. టీఎంసీ నేత సుధీప్ బందోపాధ్యాయ, ఆప్ నేత సంజయ్ సింగ్ కూడా ఈ దాడి ఘటన భద్రతా లోపాలను చూపిస్తోందని.. ఈ క్రమంలో భద్రతా లోపాలు ఎందుకు జరిగాయి.. వాటిని ఏ విధంగా సరిచేస్తున్నారు అనే దానిపై ప్రధాని మోదీ జవాబు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాజ్యసభ సభ్యులు కపిల్ సిబల్ కూడా ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఉగ్రవాదంపై దేశం ఏకమైందని.. ప్రపంచానికి సందేశం ఇవ్వడానికి పార్లమెంటులో ఏకగ్రీవ తీర్మానం ఆమోదించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని లేఖలో కోరారు. ఉగ్రవాద దాడుల ఫలితంగా ఉత్పన్నమయ్యే పరిస్థితిని ఎదుర్కోవడానికి సమిష్టి సంకల్పాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. అయితే బైసరన్ లోయ తెరిచిన విషయం తమకు తెలియదని కేంద్రం తెలిపింది. ఇది కచ్చితంగా భద్రతా వైఫల్యమేనని ఎంపీ సుప్రియా సూలే పేర్కొన్నారు.

# నేడు అక్షయ తృతీయ పుణ్యతిథి

**తిరుమల, ఏప్రిల్ 29 :** అక్షయమంటే క్షయం కానిది. ఈ రోజు అంటే బుధవారం అక్షయ తృతీయ హిందువులకు చాలా ప్రత్యేకమైన, పవిత్రమైన రోజు. ఈ పండుగను ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో శుక్ల పక్షం మూడో రోజు వస్తుంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న వచ్చింది.అక్షయ తృతీయ రోజున వివాహం, గృహప్రవేశం, కొత్త వ్యాపారం లాంటి శుభ కార్యక్రమాలు ప్రారంభించడానికి, దానధర్మాలు చేయడానికి ఉత్తమమైనదిగా పరిగణిస్తాయ. అక్షతయ తృతీయరోజున చేసే అన్ని మంచి పనులు శాశ్వత ప్రభావాన్ని చూపుతాయి. పురాణాల ప్రకారం ఈ రోజునే శ్రీ మహావిష్ణువు లక్ష్మీదేవిని పెళ్లాడాడని ప్రతీతి. పరమశివుడు కుబేరుడిని సంపదలకు సంరక్షకుడిగా నియమించాడు. ఇక, అక్షయ తృతీయ రోజు కేవలం మతపరంగానే ముఖ్యమైనది కాదు. జీవితంలో ఆనందం, శ్రేయస్సు, విజయాన్ని పొందడానికి గొప్ప అవకాశాన్ని కూడా ఇస్తుందని పండితులు చెబుతారు. అయితే, లక్ష్మీదేవి కటాక్షం దక్కాలంటే ఆమెకు ఇష్టమైన మంచి పనులనే చేయాలి. అక్షయ తృతీయ నాడు విష్ణువు, లక్ష్మీ దేవికి ఆచారం ప్రకారం పూజించాలి. అక్షయ తృతీయ రోజున చేసే దానానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఆహారం, బట్టలు, బంగారం, ఆవు, గొడుగు మొదలైన వాటిని దానం చేస్తే చాలా శుభప్రదం అంటారు. అక్షయ తృతీయ రోజున ఏదైనా కొత్త పని చేయడాన్ని శుభప్రదంగా భావిస్తారు. కొత్తగా ఆస్తి లేదా ఇంకేదైనా కొనేందుకు, ఎక్కడైనా పెట్టుబడి పెట్టేందుకు అక్షయ తృతీయ అనుకూలమైన రోజుగా భావిస్తారు. ఈ రోజున బంగారం, వెండి, వాహనం, ఇల్లు లేదా భూమిని కొంటే శుభం కలిగి అదృష్టం నడిచొస్తుందని భావిస్తారు.



## జిహెచ్ఎంసి కమిషనర్‌గా ఆర్.వి. కర్ణన్ బాధ్యతల స్వీకరణ



**హైదరాబాద్, రాజముద్ర న్యూస్ :** జిహెచ్ఎంసి కమిషనర్‌గా ఆర్.వి. కర్ణన్ మంగళ వారం ఉదయం బాధ్యతలను స్వీకరించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఐఏఎస్ అధికారుల బదిలీలలో భాగంగా ఆర్.వి. కర్ణన్ ఐఏఎస్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా నియమితులయ్యారు. బదిలీ పై వెళుతున్న కమిషనర్ కె. ఇలంబర్తి నుండి ఆర్ వి కర్ణన్ మంగళవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా సేవలందించిన ఆర్.వి. కర్ణన్, హైజీన్ ప్రమాణాలను ఉల్లంఘించిన రెస్టారెంట్లు, పబ్‌లు, ఐస్‌క్రీమ్ పార్లర్లు వంటి ఆహార సంస్థలపై రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా దాడులు నిర్వహించి, ప్రజలలో ఆహార భద్రతపై అవగాహన పెంచారు. జిహెచ్ఎంసి కమిషనర్ గా కొనసాగిన కె.ఇలంబర్తి, జిహెచ్ఎంసి కమిషనర్‌గా తన పదవీకాలంలో నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, పౌర సేవల మెరుగుదల కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలో ఏం ఏ యు డి కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ కు అదే విధంగా బదిలీ పై వెళుతున్న ఇలంబర్తి కి జిహెచ్ఎంసి అధికారులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



## ఉగ్రదాడికి నిరసనగా కన్నీటి నివాళులర్పించిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** జమ్ముకాశ్మీర్ లోని పహల్గామ్ లో ఇటీవలే జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన అమరుల ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, జిహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన లిబర్టీ లోని జిహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయ ఆవరణలో కన్నీటి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ...ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జిహెచ్ఎంసీ కమీషనర్లు, తదితర డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## ఉగ్రవాదంపై అందరం కలిసి పోరాడుదాం

### శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదంపై అందరం కలిసి పోరాడుదాం, పహల్గామ్‌లో జరిగిన భయంకరమైన ఉగ్రవాద దాడిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం అని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి జగదీశ్వర్ గౌడ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వాళ్ళ ఆత్మకు శాంతి చేకూరాలని మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన పహల్గం ఉగ్రవాదుల దాడిపై నిరసన, మరణించిన వారికి "సంతాప" కార్యక్రమంలో నగర మేయర్, డిప్యూటీ మేయర్, అల్ పార్టీ కార్పొరేటర్లు, శేరిలింగంపల్లి నియోజకవర్గం కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, దొడ్ల వెంకటేష్ గౌడ్, అధికారులు సిబ్బందితో కలిసి పాల్గొని ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు.

## కూచిపూడి నాట్యంలో రాణిస్తున్న మోక్షధృతి



**ఘట్ కేసర్, రాజముద్ర న్యూస్:** కూచిపూడి నాట్యాన్ని అద్భుతంగా చేసి అందరిని మెప్పించిన కళాకారిణి మోక్షధృతి అభినందనీయురాలని యక్షగాన కంఠీరవ, ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు పసుమర్తి శేషుబాబు తెలిపారు. ఘట్ కేసర్ మున్సిపాలిటీ ఎన్ ఎఫ్ సీ నగర్ కు చెందిన మోక్షధృతి నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన స్ఫూర్తి నేషనల్ డాన్స్ ఫెస్ట్-2025 కార్యక్రమంలో కూచిపూడి నృత్య కళాకారిని మోక్షధృతి పాల్గొని అత్యంత ప్రతిభ పాటవాన్నీ ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమే తల్లిదండ్రులు దోసపాటి శంకర్, ప్రవర్తి లను కూడ అభినందించి శాలువాలు, పుష్పగుచ్చాలతో సన్మానించారు. నాట్య కళాకారిణి మోక్షధృతిని ప్రఖ్యాత కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ పసుమర్తి శేషుబాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అకుంఠిత దీక్ష, పట్టుదలతో అత్యుత్తమ ప్రదర్శనలు ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు సాధించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, నృత్యాచార్యులు, నాట్య గురువులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించండి

### కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** శేరిలింగంపల్లి డివిజన్ లోగల గోపినగర్ దర్గా, చర్చి బస్తీలలో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ జలమండలి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ, సీసీ రోడ్డు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్వయంగా సమస్యలను ఇంజనీరింగ్ సెక్షన్ ఏఈ భాస్కర్, వాటర్ వర్క్స్ మేనేజర్ అభిషేక్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ వెంకట్ రామ్ రెడ్డితో కలిసి స్థానికవాసులతో రచ్చబండ వేదికగా మమేకమై వారి ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించిన కార్పొరేటర్ ఆయా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ...గోపినగర్, నెహ్రూనగర్ లలో



అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని సూచించారు. డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికిగాను వెంటనే కొత్త పైపులైన్ ఏర్పాటు పనులు మొదలు పెట్టాలని సూచించారు. త్రాగు నీరు, మురుగు నీటి సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సీసీ రోడ్డు మంజూరు కాగ అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ పనులు పూర్తి చేసిన వెంటనే సీసీ రోడ్డు పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యాదా గౌడ్, దస్తగిరి, రవి, గఫుర్, అశోక్, రజాక్, ఖాజా, నాని, బాలస్వామి, చోటు, చంద్రమౌళి, ప్రవీణ్, ఎజాజ్, జగదీశ్, రాంచందర్, మహిళలు నిరూప, లక్ష్మి, కవిత, గౌసియా బేగం, స్వరూప రాణి, ఎల్లమ్మ, స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పహల్గాం ఉగ్రదాడి పై జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిరసన

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్ :** ఉగ్రవాదాన్ని అరికట్టడానికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ తీసుకునే ఏ చర్యలకైనా తమ పూర్తి మద్దతు ఉంటుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. పహల్గాం ఉగ్రదాడి పై నిరసనగా మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమీషనర్ ఆర్.వి.కర్ణన్, కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది నిరసన తెలుపుతూ ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడి భారతీయులందరీ గుండెలను కలచివేసిందని అన్నారు. ఉగ్రవాదంపై ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తున్నాయ న్నారు. ఉగ్రదాడి మానవతా విలువలకు, శాంతికి, సమాజ శ్రేయస్సుకు వ్యతిరేక చర్యగా ఆమె పేర్కొన్నారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ ఘటనపై ప్రజలందరూ కుల, మతాలకు అతీతంగా





ఐక్యతతో స్పందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశ రక్షణకు, ప్రజల భద్రతకు తీసుకునే ఏ నిర్ణయానికైనా పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. అనంతరం వివిధ పార్టీల కార్పొరేటర్లు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అన్నారు. దేశ ప్రధాని తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. ఉగ్రవాదాన్ని అణచివేయడానికి ప్రధాని చేపట్టే అన్ని చర్యలకు భారతీయులుగా తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో మరణించిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల కార్పొరేటర్లు, వంగ మధుసూదన్ రెడ్డి, రాధా ధీరజ్ రెడ్డి, లాల్ సింగ్ మీర్జాబేగ్, సోహెల్ ఖాద్రీ, జగదీశ్వర్ రావు, రాజశేఖర్ రెడ్డి, బిజెపి, ఏ ఐ ఎం ఐ ఎం, కాంగ్రెస్ కార్పొరేటర్లు, సి సి పి శ్రీనివాస్, సి ఈ భాస్కర్ రెడ్డి, రత్నాకర్ అడిషనల్ కమిషనర్లు గీత రాధిక, వేణు గోపాల్, సరోజ, పంకజ, జోనల్, కమిషనర్ లు రవికిరణ్, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, వెంకన్న ,సి ఏ అండ్ హెచ్ ఓ డాకర్ పద్మజతో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది, జిహెచ్ఎంసికి చెందిన ఆయా యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకు ముందు మరణించిన వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.



తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల సంఘం చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన జస్టిస్ షమీమ్ అక్తర్



## సంస్థ అభివృద్దే ప్రతి ఉద్యోగి లక్ష్యం కావాలి

### డిపో మేనేజర్ కే. కవిత



**చెంగిచెర్ల, రాజముద్ర న్యూస్:** ఆర్టీసీ సంస్థ అభివృద్దే ప్రతి ఉద్యోగి లక్ష్యం కావాలని ఆర్టీసీ చెంగిచెర్ల డిపో మేనేజర్ కే. కవిత తెలిపారు. ఆర్టీసీ చెంగిచెర్ల డిపోలో ప్రగతి చక్ర అవార్డుల పురస్కారాలలో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరి చిన ఉత్తమ ఉద్యోగులకు అభినందన సభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లు, ఇందనం ఆదాచేసిన డ్రైవర్లు, బస్సులను సక్రమం గా మెయింటెనెన్స్ చేసిన మెకానిక్ లను శాలువాలతో సన్మానించి నగదు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజే శారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేసినప్పుడే ఆదాయం పెంచుకోగలుగు తామన్నారు. డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలను నివారించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రయాణికులను ఆదరించి వారి మన్నలను పొందడం ద్వారా ఆదాయాన్ని మరింత పెంచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) చంద్రమౌళి, అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్) శేషి రెడ్డి, ఈడబ్ల్యుబి సభ్యులు పద్మావతి, వెంకటేష్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు కావాలి కాని ప్రభుత్వ బడిలో చదువు వద్దు ఇదెక్కడి అన్యాయం?

### ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు మేడి శ్రీనివాస్,

**ఆత్మకూర్ ఎం రాజముద్ర న్యూస్ :** ఆత్మకూరు మండల పరిధిలోని పల్లెర్ల గ్రామంలో ఎం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షులు మేడి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అయితే కావాలి గాని ప్రభుత్వ బడి చదువు మాత్రం చేదు అయిందా అని గ్రామ ప్రజలను ప్రశ్నించారు . ఇదెక్కడి అన్యాయం అని ఆవేదన వ్యక్తం చేశారు . ప్రభుత్వ బడిలో చేర్పించుకుండా ప్రైవేట్ బడిలో చదివిస్తున్న వారి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు . ప్రైవేట్ బడి యాజమాన్యాలకు రెండు చేతులు జోడించి నమస్కారాలు తెలుపుతూ దయచేసి మా గ్రామంలోకి మీరు వచ్చి మా పిల్లలకు వారి తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి మీ బడిలో చేర్పించుకొని మా ఊరి బడిలో పిల్లలు లేకుండా చేస్తున్న తీరు ప్రతి సంవత్సరం చూస్తున్నామని ఈసారి మాత్రం ఊరుకునే ప్రసక్తేలేదని హెచ్చరించారు . అఖిల పక్ష నాయకుల సహకారంతో ప్రభుత్వ ఉపాధ్యాయులకు అండగా ఉండి మన బడిని మనకి విద్య నేర్పే గురువులను కాపాడుకుంటాం అని అన్నారు . ప్రైవేట్ బడి వద్దు ప్రభుత్వ బడి ముద్దు అనే నినాదంతో ఇంటింటికి



తిరిగి తల్లిదండ్రులకు ప్రభుత్వ బడిలో చదివితే ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో వివరిస్తామని అన్నారు . రేపటి నుంచి ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల బృందం ఇంటింటికి తిరుగుడు బంద్ పెట్టాలని ప్రైవేట్ బడుల వాహనాలు గ్రామంలోకి రావొద్దు అని అన్నారు . ఇది నా ఒక్కడి సమస్య కాదు అని ఊరు అందరి సమస్య అని దయచేసి గ్రామ ప్రజాలరా ఆలోచన చేయండి మన ఊరు మన బడిని కాపాడుకుందాం అని అన్నారు . ఈ ఒక్క విషయంలో మాత్రం కుల మత రాజకీయాలకు అతీతంగా పోరాటం చేద్దాం అని కోరారు .

## పారిశ్రామిక వాడలో భాగంగా 44.30కోట్ల వ్యయం

- హైదరాబాద్ నలువైపుల పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి
- పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు





**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** పారిశ్రామిక రంగంలో తెలంగాణ అగ్రగామిగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. వికారాబాద్ నియోజకవర్గం మోమిన్ పేట మండలం ఎన్కతల గ్రామ పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసే పారిశ్రామిక వాడలో భాగంగా 44.30 కోట్ల వ్యయంతో చేపట్టే వివిధ మౌలిక సదుపాయాలు, అంతర్గత రోడ్ల నిర్మాణాలకు శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, శాసన సభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి, బి.మనోహర్ రెడ్డి, టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మోమిన్ పేట్ మండల కేంద్రంలోని ఎజిఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన సభలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ... హైదరాబాద్ నలువైపుల పారిశ్రామిక పార్కులను ఏర్పాటుచేసి యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మోమిన్ పేటలో ఏర్పాటు చేసే పారిశ్రామిక వాడలో రెండు సంవత్సరాలలో 5 వేల కోట్ల పెట్టుబడులను సాధించి 25 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనునట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పడినట్లయితే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని ఆయన తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటుకు స్థానికలు ముందుకు రావాలని ప్రభుత్వం వారిని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడులకు ముందుకు వచ్చే ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు స్థానికులు ముందుకు రావాలని, అటువంటి వారికి ప్రభుత్వం స్థలాల కేటాయింపు తో పాటు సబ్సిడీ ప్రోత్సహకాలను అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రగతిలో భాగంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాటు అన్ని కుటుంబాలు బాగుండాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వర్షాధారం వల్ల వ్యవసాయ ఆధారపడ్డ కుటుంబాలు చాలా ఉన్నాయని అలాంటి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి అన్నారు. శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ... వికారాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి కృషి చేస్తానన్నారు. జిల్లాలో వివిధ మండలాల్లో వేల ఎకరాల భూమి ఉందని, అట్టి భూముల్లో పరిశ్రమల స్థాపనలు చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంతగానో దోహదపడుతుందని స్పీకర్ అన్నారు. అనంతగిరి ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 1000 కోట్లతో పనులు చేపట్టేందుకు ఒప్పందం కుదిరిందని ఆయన తెలిపారు. అలాగే కోట్‌పల్లి, సర్పన్‌పల్లి, జుంటుపల్లి, లక్నాపూర్ లాంటి ప్రాజెక్టులను అభివృద్ధి పరచినట్లయితే యువతకు ఉపాధి కల్పించవచ్చని వీటిని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో నాలుగు ప్రధానమైన రోడ్లను విస్తరించేందుకు కేంద్ర మంత్రి గట్కారిని కలిసి నిధుల మంజూరితో రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో 600 కోట్ల రూపాయల నిధులతో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తుందని, ఇప్పటికే పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తీసుకువెళ్తూ గత పది సంవత్సరాలలో లేని అభివృద్ధిని చేసుకుంటున్నామని స్పీకర్ ఈ సందర్భంగా తెలిపారు. శాసనమండలి చీఫ్ విప్ పి.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ... వికారాబాద్ జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచినట్లుగానే పరిశ్రమల హబ్ గా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సర్వేనెంబర్ 174, 198 లో 862 ఎకరాల స్థలం కేటాయించారన్నారు. రాబోయే ఐదేళ్లలో 15 వేల కోట్ల పెట్టుబడులతో కనీసం లక్ష నుండి లక్ష 50 మందికి ఉద్యోగ ఉపాధి కల్పన కల్పించే లక్ష్యం పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. రానున్న రెండేళ్లలో కనీసం 5000 కోట్ల పెట్టుబడులతో 25వేల మందికి ఉద్యోగాలు కల్పించాలి అనుకున్నాంమని, జిల్లాలో 1909 పరిశ్రమలు స్థాపించబడగా 2320 కోట్ల పెట్టుబడులు రాగా 7640 మందికి ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. గత ఏడాది కాలంలో జిల్లాలో 114 పరిశ్రమలు స్థాపించబడ్డాయనీ ఆయన తెలిపారు. ఇప్పటికీ 232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. జిల్లాలో ఐపాస్ ద్వారా ప్రభుత్వం ఇప్పటివరకు 127 మంది ఎస్సీలకు 362 మంది ఎస్టీలకు 16 మంది ఓసి బీసీలకు ఒక వికలాంగునికి పరిశ్రమల స్థాపన కోసం రూపాయలు 20 కోట్ల సబ్సిడీ ఇచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఆర్డీఓ వాసు చంద్ర, టిజిఐఐసి జోనల్ మేనేజర్ కవిత, తహసిల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంపీడీఓ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి లతో పాటు అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఏడు నుండి 18 సంవత్సరాల
# అనాధ పిల్లలకు వసతి ఏర్పాటు
### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** అనాధ పిల్లలుగా ఉన్నవారు చదువు ముగించుకొని వేసవికాలంలో బంధువుల దగ్గర ఉండటానికి ఇబ్బందికరంగా ఉంటే వారికోసం వసతి ఏర్పాటు చేయడం జరుగుతుందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జిల్లాలో ఎవరైనా 7 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల అనాధ పిల్లలు, ఇప్పటి వరకు హాస్టల్లో చదివి ఇపుడు వేసవి సెలవుల్లో వారి బంధువుల దగ్గర వుండటానికి ఇబ్బంది పడినచో వారు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి కాల్ చేస్తే వారికి బాల సదన్ లో ఇతర చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూట్స్ లో వుంచి తగిన భోజన వసతి ఏర్పాట్లు చేయడం జరుగుతుంది అని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మరిన్ని వివరాలకు కోసం వెంకటేశం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్, శ్రీకాంత్ డిసిపిఓ, కాంత రావు బి ర్ బి కోఆర్డినేటర్, జయసుధ, జిల్లా సంక్షేమ అధికారినిలను సంప్రదించవలసినదిగా కలెక్టర్ తెలిపారు.




## జై బాబు జై భీమ్ జై సవిధాన్ అభినయ్ కార్యక్రమం పాదయాత్ర

**ఆత్మకూర్ ఎం రాజముద్ర న్యూస్ :** రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాబు జై భీమ్ జై సవిధాన్ అభినయ్ కార్యక్రమంలో, భాగంగా, ఏఐసీసీ పిలుపుమేరకు, ఈరోజు పల్లెర్ల గ్రామంలో ప్రభుత్వ విప్పు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారి, ఆదేశాల, మేరకు ఈరోజు పల్లెర్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, పాదయా( త నిర్వహించారు, ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొడిత్యాల నరేందర్ గుప్తా, మాజీ ఎంపీటీసీ సోలిపురం మల్లారెడ్డి, మాజీవార్డ్ మెంబర్ పెద్దగాని వెంకన్న,పాల సంఘం చైర్మన్ వస్తుపుల అంజయ్య, ఇందిరమ్మ కమిటీ మెంబర్ వస్తుపుల ఎల్లయ్య,పల్లెర్ల గ్రామం సోషల్ మీడియా కన్వీనర్ సంఘపాక సతీష్, ఏలూరి వెంకటేశం, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మేడి చంద్రయ్య, గర్షకోట మచ్చగిరి మాజీ వార్డ్ మెంబర్ మంటి పెల్లి మచ్చ గిరి, వస్పరి కిరణ్, మద్దికుంట వీరబాబు, కన్నెబోయినమల్లయ్య,ఏనుగు సత్తిరెడ్డి, రాపోలు స్వామి, తదితరులు పాల్గొన్నారు,



# దేశ వ్యతిరేకులపై స్పైవేర్ ఉపయోగిస్తే తప్పేంటీ?
### 'పెగాసస్'పై సుప్రీం కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** దాదాపు నాలుగేళ్ల క్రితం దేశ రాజకీయాలను కుదిపేసిన పెగాసస్ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ స్పైవేర్‌ను వినియోగించి దేశంలోని పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖులపై నిఘా పెట్టారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై మంగళవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. జాతీయ భద్రతా ప్రయోజనాల కోసం ఓ దేశం స్పైవేర్‌ను కలిగిఉండటం తప్పులేదని కోర్టు స్పష్టం చేసింది. అయితే, అది ఎలా, ఎవరిపై ఉపయోగించారన్న దాని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. పెగాసస్ ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈసందర్భంగా పిటిషన్ తరపున న్యాయవాది మాట్లాడుతూ.. పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగిస్తోందా? లేదా అన్న విషయాన్ని కేంద్రం స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేగాక, ఈ ఆరోపణలపై దర్యాప్తు జరిపి సాంకేతిక నిపుణుల బృందం నివేదిక కోసం సర్వోన్నత న్యాయస్థానం గతంలో ఆదేశించిందని, ఇప్పటివరకూ ఆ నివేదిక అందలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దాన్ని వెంటనే బహిర్గతం చేయాలని కోరారు. దీనికి ధర్మాసనం బదులిస్తూ.. "దేశం స్పైవేర్‌ను వినియోగిస్తే గనుక అందులో తప్పేముంది. అయితే, దాన్ని ఎవరిపైన ఉపయోగిస్తున్నారన్నదే ఇక్కడ ప్రశ్న. పౌర సమాజంపై కాకుండా.. దేశ వ్యతిరేక శక్తులపై దీన్ని వినియోగిస్తే గనుక అందులో ఏ తప్పు లేదు. దేశ భద్రత విషయంలో రాజీపడకూడదు. ఒకవేళ సామాన్య పౌరులపై ఉపయోగిస్తే గనుక దాని గురించి మేం దర్యాప్తు జరిపిస్తాం. ఉగ్రవాదులు గోప్యత హక్కును కోరకూడదు. అయితే, సామాన్య పౌరుల గోప్యతకు మేం తప్పకుండా రక్షణ కల్పిస్తాం" అని స్పష్టంచేసింది. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. "ప్రస్తుతం మన దేశం ఎలాంటి పరిస్థితిలో ఉందో అందరికీ తెలుసు. మనం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది" అని పేర్కొంది. ఇక, సాంకేతిక బృందం నివేదిక గురించి మాట్లాడుతూ.. "దేశ భద్రత, సార్వభౌమత్వానికి సంబంధించిన నివేదికను బహిర్గతం చేయడం సరికాదు. ఒకవేళ ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు దాని గురించి తెలుసుకోవాలనుకుంటే.. వారికి సమాచారం అందిస్తాం. అంతేగానీ.. వీధుల్లో చర్చించుకునే ఓ డాక్యుమెంట్‌గా ఈ నివేదిక మారకూడదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

### ఏంటీ పెగాసస్ దుమారం..?

ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్‌ఎస్‌వో గ్రూప్ అనే సంస్థ 'పెగాసస్' స్పైవేర్‌ని అభివృద్ధి చేసింది. నిఘా కార్యకలాపాల కోసం ఈ స్పైవేర్‌ను ఎన్‌ఎస్‌వో పలు ప్రభుత్వాలు, ప్రభుత్వ అధీనంలో పనిచేసే సంస్థలకు విక్రయిస్తుంటుంది. అయితే, ఈ పెగాసస్‌ను ఉపయోగించి పాత్రికేయులు, పౌరసమాజ ప్రముఖుల ఫోన్లను హ్యాక్ చేశారంటూ 2021లో ఓ అంతర్జాతీయ పత్రిక సంచలన కథనం ప్రచురించింది. భారత్ నుంచి 300 మంది ఫోన్లు హ్యాక్ అయినట్లు పేర్కొంది. వీరిలో రాజకీయ ప్రముఖులు కూడా ఉన్నట్లు తెలిపింది. దీంతో ఈ వివాదం దేశ రాజకీయాలను కుదిపేసింది. అనంతరం దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ క్రమంలోనే పెగాసస్‌పై విచారణకు ఆదేశించిన సుప్రీం.. ముగ్గురు సభ్యులతో స్వతంత్ర నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ నివేదిక రూపొందించింది.

# ఎక్స్ ప్లోజివ్ కంపెనీలో భారీ పేలుడు

- కాటేపల్లి లో జరిగిన సంఘటన
- నలుగురికి తీవ్ర గాయాలు ఇద్దరి మృతి
- భారీ శబ్దంతో ఒక్కసారిగా కుప్పకూలిన భవనం



**మోటకొండూరు, రాజముద్ర న్యూస్ :** కంపెనీలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి వద్ద ఉన్న ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్ లిమిటెడ్ కంపెనీలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. భారీ పేలుడు ధాటికి గాయాలపాలైన నలుగురిని ఆస్పత్రికి తరలించారు. భారీ పేలుడు ధాటికి భవనం కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్రగాయాలు కాగా మరో ఇద్దరు ఆచూకీ లభించకపోవడంతో శిధిలాల కింద ఉండవచ్చునని గుర్తించారు. గాయపడిన వారిలో బుగ్గ లింగస్వామి, నల్ల మహేష్, బి.శ్రీకాంత్, ఆర్ శ్రీకాంత్‌గా గుర్తించారు. గును గుంట్ల సందీప్ దేవీ చరణ్ ఆచూకీ లభించలేదు. క్షతగాత్రు లైన వారిని వైద్యం కోసం భువనగిరిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని యశోద ఆసుపత్రికి తరలించారు. వారి ఆచూకీ గుర్తించేందు కు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలిస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరిశీలించారు.

### పరిశ్రమను తొలగించాలని స్థానికుల ధర్నా

తాజా ఘటనతో ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్ పరిశ్రమ వద్ద స్థానికులు ధర్నాకు దిగారు. పేలుడు పదార్థాల పరిశ్రమను అక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎక్స్ ప్లోజివ్ పరిశ్రమ ముందే బైఠాయించి నిరసన తెలుపుతున్నారు. అనంతరం భువనగిరి మోత్కూరు ప్రధాన రహదారిపై మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలను గ్రామస్థులు బైఠాయించారు. ధర్నా చేస్తున్న గ్రామస్తులతో కలిసి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ రోడ్డుపై బైఠాయించారు. అనంతరం వారు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు,క్షతగాత్రులైన కుటుంబాలకు అండగా ఉండి న్యాయం చేకూర్చే వరకు అండగా ఉంటామని తెలియజేశారు.





# దాయాదికి మరో షాక్..
### పాక్ ఎయిర్‌లైన్లకు భారత గగనతలం మూసివేత..?

**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. తమపై ఆంక్షలు విధించిందనే అక్కసుతో భారత్‌పై పాకిస్థాన్ విషం చిమ్మింది. తమ గగనతలంపై మన దేశ విమానాల రాకపోకలపై నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో న్యూదిల్లీ కూడా దీనిపై ప్రతీకార చర్యలకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పాక్ విమానయాన సంస్థలకు మన గగనతలాన్ని మూసివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇక, పాకిస్థానీ నౌకలు కూడా భారత పోర్టుల్లోకి రాకుండా నిషేధం విధించనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. "ప్రస్తుతం ఈ ప్రతిపాదన పరిశీలన దశలో ఉంది. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు" అని కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఓ అధికారి వెల్లడించినట్లు సమాచారం. ఒకవేళ దీనిపై భారత్ నిర్ణయం తీసుకుంటే.. అది పాక్ ఎయిర్‌లైన్లపై పెను ప్రభావం చూపించే అవకాశం ఉంది. పాక్ విమానాలు కౌలాలంపూర్ సహా మలేసియాలోని ఇతర నగరాలు, సింగపూర్, థాయ్‌లాండ్ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే మన గగనతలాన్ని దాటాల్సిందే. ఇప్పుడు భారత్ నిషేధం విధిస్తే.. దక్షిణాసియా ప్రాంతాలకు వెళ్లేందుకు చైనా లేదా శ్రీలంక మీదుగా విమానాలను మళ్లించాల్సి ఉంటుంది. అప్పుడు ప్రయాణసమయం పెరగడంతో పాటు నిర్వహణ పైనా అదనపు భారం పడుతుంది. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన పాక్ ఎయిర్‌లైన్లకు ఇది మరింత శరాఘాతంగా




మారనుంది. ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల మన విమానాలకు పాక్ తమ గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. దీంతో భారత ఎయిర్‌లైన్లు కూడా ప్రత్యామ్నాయ మార్గాల్లో విమానాలు నడుపుతున్నాయి. అయితే, ఈ నిర్ణయంతో ఆర్థికంగా మనకంటే పాక్‌కే ఎక్కువ నష్టం అని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటి వరకు భారత్ నుంచి పాక్ గగనతలం మీదుగా వారానికి 800 లకు పైగా అంతర్జాతీయ విమానాలు రాకపోకలు సాగించేవి. ఇందుకోసం ఓవర్‌ఫ్లైట్ ఫీజు కింద పాక్ రోజుకు 1,20,000 డాలర్లు వసూలుచేసింది. ఇప్పుడు ఆ మొత్తాన్ని దాయాది నష్టపోవాల్సిందే. 2019లో పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో దాదాపు 5 నెలల పాటు పాక్ తమ గగనతలంలో భారత విమానాలపై ఆంక్షలు విధించింది. దీంతో అప్పట్లో ఆ దేశం 100 మిలియన్ డాలర్ల పైగా నష్టపోయినట్లు సమాచారం.

# చైనా రెస్టారెంట్‌లో భారీగా మంటలు
### 22 మంది మృతి


**బీజింగ్ :** చైనాలో విషాద ఘటన చోటుచేసుకుంది. లియోనింగ్ ప్రావిన్స్‌లోని లియోయాంగ్ నగరంలో మంగళవారం ఓ రెస్టారెంట్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 22మంది మృతిచెందారు. మధ్యాహ్నం 12.25గంటల సమయంలో రెస్టారంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో 22మంది మృత్యువాత పడగా .. మరో ముగ్గురికి గాయాలైనట్లు స్థానిక మీడియా పేర్కొంది. అయితే, ఈ ప్రమాదానికి కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పందించారు. ఈ ఘటనలో క్షతగాత్రులకు చికిత్స అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ నెలలోనే చైనాలో ఇది రెండో అతిపెద్ద అగ్నిప్రమాదం కావడం గమనార్హం. ఏప్రిల్ 9న నార్త్ చైనాలోని హెబీ ప్రావిన్స్‌లోని



ఓ నర్సింగ్ హోమ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 20మంది వృద్ధులు మృతి చెందారు. చెంగ్డే నగరంలోని లాంగ్హువా కౌంటీలోని నర్సింగ్ హోమ్‌లో మంటలు చెలరేగిన సమయంలో 39మంది వృద్ధులు భవనంలో ఉండగా.. 20మంది ప్రాణాలు కోల్పోవడం అప్పట్లో విషాదం రేపింది.

# మనం ఐక్యంగా ఉండాలి..
### ట్రంప్‌నకు అవకాశం ఇవ్వొద్దు : కెనడా ప్రధాని

**కెనడా :** కెనడాలో అధికార లిబరల్ పార్టీ మరోసారి అధికారం చేపట్టడం దాదాపు ఖాయమైంది. దీంతో విజయం దిశగా దూసుకెళ్తోంది. నూతన ప్రధానిగా మార్క్ కార్నీ మరోసారి బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈనేపథ్యంలో ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజల్లో విభేదాలు సృష్టించి, విచ్ఛిన్నం చేసి కెనడాను సొంతం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో అమెరికా సుంకాలు, విలీనానికి సంబంధించిన బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. కాబట్టి ఎలాంటి పరిస్థితులు ఎదురైనా కెనడియన్లు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ట్రంప్ మొదలుపెట్టిన వాణిజ్యయుద్ధంలో అగ్రదేశంపై తాము గెలుస్తామని కార్నీ ప్రజలకు హామీ ఇచ్చారు. అమెరికా తమకు చేస్తున్న ద్రోహాన్ని ఎన్నటికీ మరిచిపోవ్దని.. దీని నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. ఎన్నో ఏళ్లుగా కెనడా అనుసరిస్తున్న ఐక్యత, అభివృద్ధి, స్థితిస్థాపకత వంటి విలువలను తాను ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన మొదటి కొన్ని నెలలు సవాలుగా ఉండొచ్చని.. అయినప్పటికీ దేశాన్ని




ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కెనడా గతంలో కంటే బలంగా పుంజుకుంటుందని అన్నారు. ఎన్నికల్లో తమకు గట్టి పోటీ ఇచ్చినందుకు ప్రతిపక్ష నాయకుడు పోయిలివ్రేను కార్నీ అభినందించారు. దేశ అభివృద్ధి విషయంలో తామందరం ఒకేలా ఆలోచిస్తామని తెలిపారు. కెనడా తమలో విలీనం కావాలని ఇప్పటికే పలుమార్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులకు పాల్పడిన విషయం తెలిసిందే. నేడు ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో ఆయన మరోసారి టారిఫ్‌ల ప్రస్తావన తీసుకువచ్చారు. కెనడా అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరితే.. ఇప్పటివరకు విధించిన సుంకాలను పూర్తిగా తొలగిస్తానన్నారు. యూఎస్‌తో ఎలాంటి సరిహద్దులు లేకుండా ప్రజలందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తామని.. వాణిజ్యం, వ్యాపారాల్లో ప్రతికూలతలు లేకుండా అన్నిరకాల సానుకూల చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తమ ప్రతిపాదనకు ఒప్పుకుంటే ఇలాంటి ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని.. లేదంటే ప్రతియేటా ఆ దేశానికి ఇస్తున్న వందల బిలియన్ డాలర్ల సబ్సిడీని ఆపేస్తామని హెచ్చరించారు.

## భారత్‌లో పాక్ రక్షణ మంత్రి
# 'ఎక్స్' ఖాతా నిలిపివేత




**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ రక్షణమంత్రి ఖవాజా మహమ్మద్ అసిఫ్ ఎక్స్ ఖాతాను భారత ప్రభుత్వం నిలిపివేసింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్ముకశ్మీర్‌పై ఆ మంత్రి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న కారణంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. చట్టపరమైన డిమాండ్‌కు ప్రతిస్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆ ఖాతాను ఓపెన్ చేసిన వారికి ఒక సందేశం దర్శనమిస్తోంది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపడుతోంది. పాకిస్థాన్ కేంద్రంగా నిర్వహిస్తున్న పలు యూట్యూబ్ ఛానల్ల ప్రసారాలను భారత్‌లో నిషేధించిన సంగతి తెలిసిందే. పాక్ న్యూస్, ఎంటర్‌టైన్‌మెంట్ మీడియాకు చెందిన 16 ఛానల్లపై ఈ వేటు వేసింది. ఈ క్రమంలోనే రక్షణ మంత్రి ఖాతాను బ్లాక్ చేసింది. పహల్గాం దాడి తర్వాత పాక్ రక్షణమంత్రి పలుమార్లు మీడియాతో మాట్లాడారు. ఉగ్రవాదులను పెంచి పోషించడంపై మీ స్పందన ఏంటి? అని మీడియా అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ.. "అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమదేశాల కోసమే మూడు దశాబ్దాల పాటు మేం ఈ చెత్త పనులన్నీ చేస్తున్నాం. అయితే అది పొరబాటు అని అర్థమైంది. దానివల్ల పాక్ చాలా ఇబ్బందులు పడింది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో మేం చేరకపోయి ఉంటే.. పాక్‌కు తిరుగులేని ట్రాక్ రికార్డ్ ఉండేది" అని అన్నారు. అలా చెప్తూనే.. లష్కరే తోయిబా ఉనికి ఇప్పుడు తమ దేశంలో లేదన్నారు. అలాగే సోమవారం మీడియాతో మాట్లాడుతూ.."ఇప్పుడు అది (ప్రతీకార దాడి) జరగనున్న విషయం కాబట్టి.. మా బలగాలను అప్రమత్తం చేశాం. దాడులు జరిగే పరిస్థితుల్లో కొన్ని వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆ మేరకు చర్యలు తీసుకున్నాం" అని మంత్రి ఖవాజా ఆసిఫ్ ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. అయితే, తన అంచనాలకు దారి తీసిన వివరాలను మాత్రం ఆయన వెల్లడించ లేదు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని వీడేవరకూ ఆ దేశంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించిన భారత్.. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాక్ జాతీయులను దేశం నుంచి వెళ్లగొట్టింది.

## మెహుల్ ఛోక్సీకి బెల్జియం కోర్టులో ఎదురుదెబ్బ



**బెల్జియం :** కుట్ర, మోసం, అవినీతి అభియోగాలు ఎదుర్కొంటున్న వజ్రాల వ్యాపారి, ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీని బెల్జియం పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తన అరెస్టుని ఛోక్సీ బెల్జియం కోర్టులో సవాల్ చేశారు. అయితే, న్యాయస్థానంలో అతడికి ఎదురుదెబ్బ తగిలింది. ఛోక్సీ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరగ్గా.. కోర్టు కేసును వాయిదా వేసింది. తదుపరి విచారణ ఎప్పుడు ఉంటుంది అనేది తెలియరాలేదు. ఈ పిటిషన్‌లో అతడు బెల్జియం అధికారులపై పలు ఆరోపణలు చేసినట్లు తెలుస్తోంది. తన అరెస్టుకు సంబంధించి అధికారులు సరైన చట్ట విధానాలను అనుసరించలేదని, తన ప్రాథమిక హక్కులకు సైతం భంగం కలిగించారని ఆరోపించాడని అధికారిక వర్గాలు తెలిపాయి. ఇక, గతవారం బెయిల్ కోసం ఛోక్సీ పిటీషన్ దాఖలు చేశారు. అయితే, న్యాయస్థానం దాన్ని తిరస్కరించింది. ఈ విషయాన్ని ఛోక్సీ న్యాయవాది విజయ్ అగర్వాల్ వెల్లడించారు. ఛోక్సీ తీవ్ర అనారోగ్యం పాలయ్యారని, క్యాన్సర్‌కు చికిత్స పొందుతున్నారని అగర్వాల్ తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను దాదాపు రూ.13 వేల కోట్లకు పైగా మోసం చేశారని 2018లో ఆరోపణలు వెల్లువెత్తిన అనంతరం ఛోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ (కేసులో మరో ప్రధాన నిందితుడు) దేశం విడిచి పారిపోయారు. ఛోక్సీ ఆంటిగ్వా-బార్బుడాకు వెళ్లగా.. నీరవ్‌మోదీ లండన్‌లో ఆశ్రయం పొందాడు. ఛోక్సీ బెల్జియం పౌరసత్వం తీసుకున్నాడని గత నెల అక్కడి ప్రభుత్వం ధ్రువీకరించింది. ఆ దేశ జాతీయురాలైన తన సతీమణి ప్రీతి ఛోక్సీ సాయంతో 2023 నవంబరులో అతడు 'ఎఫ్ రెసిడెన్సీ కార్డ్' పొందాడు. అందుకు అతడు తప్పుడు పత్రాలు సమర్పించినట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా.. అతడికి భారత్‌లో, అంటిగ్వాలో పౌరసత్వాలు ఉన్న విషయాన్ని దాచి పెట్టాడు. ఈ కారణాలతోనే అక్కడి అధికారులు ఛోక్సీని అరెస్టు చేశారు. మరోవైపు.. అతడిని భారత్‌కు రప్పించేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.



# ఎన్‌కౌంటర్‌లో దొరికిన ఫోన్‌లో మూసా ఫొటో..
### పహల్గాం టెర్రరిస్టుల గుర్తింపులో కీలకం..

**న్యూఢిల్లీ :** కొన్ని నెలల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన ఓ ఉగ్రవాది వద్ద నుంచి స్వాధీనం చేసుకొన్న ఫోన్ నుంచి పహల్గాం మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది ముసా ఫొటో బయటకు వచ్చింది. బైసరన్ లోయ ఉగ్రదాడిలో పాల్గొన్న విదేశీ టెర్రరిస్టులు జమ్మూకశ్మీర్‌లోకి చాలాకాలం క్రితమే ప్రవేశించినట్లు దర్యాప్తు వర్గాలు భావిస్తున్నారు. దాదాపు ఏడాదిన్నర క్రితమే ఒక ఉగ్రబృందం సాంబా-కథువాల మధ్య సరిహద్దు కంచెను కత్తిరించింది. ఆ బృందంలో పహల్గాం దాడిలో పాల్గొన్న అలిభాయ్ అలియాస్ తాలా, హషీమ్ ముసా అలియాస్ సులేమానీ ఉన్నట్లు తెలుస్తోంది. వీరు నాటినుంచి పలు దాడుల్లో పాల్గొన్నారు. దీంతో మొదలైన దర్యాప్తుల్లో చొరబాటు అంశం బయటకు వచ్చింది. ఈ విషయంపై ఇప్పటికే కేంద్ర హోంశాఖ ఓ బీఎస్‌ఎఫ్ సీనియర్ అధికారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రస్తుతం ఆర్మీ, రాష్ట్రీయ రైఫిల్స్ బృందాలు అనంతనాగ్‌లోని పర్వతశ్రేణుల్లో వీరి కోసం గాలింపును ముమ్మరం చేశాయి. సాంకేతిక ఆధారాలు, స్థానిక జాతుల సహకారంతో ఈ వేట సాగుతోందని అధికారులు పేర్కొన్నారు. గతేడాది సోన్‌మార్గ్ దాడిలో ఏడుగురు వ్యక్తులను ఉగ్రవాదులు హత్య చేశారు. ఇక బైసరన్ దాడిలో ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం సీసీ కెమెరా దృశ్యాలు, స్థానిక గైడ్లు, పర్యాటకుల నుంచి సేకరించిన సమాచారంతో ఉగ్రవాదులను తాజాగా గుర్తించారు. కశ్మీర్ లోయలో చురుగ్గా ఉన్న టెర్రరిస్టుల ఫొటోలను వారికి చూపగా మూసాను గుర్తించారు. ఓ ఎన్‌కౌంటర్‌లో స్థానిక ఉగ్రవాది జునైద్ అహ్మద్ భట్‌ను మట్టుబెట్టిన భద్రతా దళాలు అతడి ఫోన్‌ను స్వాధీనం చేసుకొన్నాయి. దానిలో మూసా గుర్తింపునకు వాడిన ఫొటో భద్రతా దళాలకు దొరికింది. అంతేకాదు.. సోన్‌మార్గ్ దాడి సమయంలో సీసీకెమెరా దృశ్యాల్లో కూడా మూసా ఉన్నాడు. ఇక జునైద్ నుంచి స్వాధీనం చేసుకొన్న ఫోన్‌లో ఇతర ఉగ్రవాదుల చిత్రాలు కూడా ఉన్నాయి. అలీభాయ్ ఫొటో దళాలకు లభించింది.



# సొంతగడ్డపై పోరాడి ఓడిన ఢిల్లీ

## కోల్‌కతాకు నాలుగో విజయం

**ఢిల్లీ :** ఐపీఎల్ 18లో కోల్‌కతా నైట్‌రైడర్స్ నాలుగో విజయం సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 14 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. రఘువంశీ (44) టాప్ స్కోరర్. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేసింది. డుప్లెసిస్ (62, 45 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులు), అక్షర్ పటేల్ (43, 23 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు), విప్రాజ్ నిగమ్ (38, 19 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సులు) పోరాడినా ఢిల్లీకి ఓటమి తప్పలేదు. కోల్‌కతా బౌలర్లలో సునీల్ నరైన్ 3, వరుణ్ చక్రవర్తి 2, అనుకుల్ రాయ్, వైభవ్ అరోరా, రస్సెల్ ఒక్కో వికెట్ తీశారు. 205 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి తొలి ఓవర్‌లోనే షాక్ తగిలింది. అనుకుల్ రాయ్ బౌలింగ్‌లో అభిషేక్ (4) రస్సెల్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం కరుణ్ నాయర్‌తో జట్టు కట్టిన డుప్లెసిస్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. అయితే అరోరా బౌలింగ్‌లో కరుణ్ (15) రింకు సింగ్‌కు క్యాచ్ ఇచ్చాడు. 60 పరుగుల వద్ద రాహుల్ రనౌట్ అయ్యాడు. దీంతో ఢిల్లీ తీవ్ర కష్టాల్లో పడింది. అనంతరం క్రీజులోకి వచ్చిన అక్షర్‌పటేల్‌తో కలిసి డుప్లెసిస్ చెలరేగాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 76 పరుగులు జోడించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని నరైన్ విడదీశాడు. 136 పరుగుల వద్ద అక్షర్ ఔటయ్యాడు. అదే ఓవర్లో స్టబ్స్ (1)ను సైతం నరైన్ బోల్తా కొట్టించాడు. 16వ ఓవర్ రెండో బంతికి డుప్లెసిస్ పెవిలియన్ చేరడంతో ఢిల్లీ ఓటమి ఖరారైంది. చివర్లో విప్రాజ్ చెలరేగినా ఫలితం లేకుండా పోయింది.

### చెలరేగిన రఘువంశీ, రింకు సింగ్..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతాకు శుభారంభం దక్కింది. తొలి వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం లభించింది. గుర్బాజ్ (26: 12 బంతుల్లో 5 ఫోర్లు, ఒక సిక్స్), నరైన్ (27: 16 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) దంచికొట్టారు. మూడు ఓవర్లలోనే 48 పరుగులు చేశారు. అయితే మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో అభిషేక్‌కు క్యాచ్ గుర్బాజ్ ఔటయ్యాడు. అనంతరం వచ్చిన రహానె (26: 14 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్స్) సైతం బ్యాటు ఝుళిపించాడు. అయితే 85 పరుగుల వద్ద విప్రాజ్ నిగమ్ బౌలింగ్‌లో నరైన్ ఎల్బీ అయ్యాడు. అనంతరం స్వల్ప తేడాతో అక్షర్ పటేల్ బౌలింగ్‌లో రహానె సైతం ఎల్బీగా వెనుదిరిగాడు. పదో వెంకటేశ్ అయ్యర్ (7) అక్షర్ బౌలింగ్‌లోనే పెవిలియన్ చేరాడు. ఇన్నింగ్స్ సగం పూర్తయ్యేసరికి నాలుగు వికెట్లు కోల్పోయి.. కష్టాల్లో పడ్డ కోల్‌కతాను రింకు సింగ్ (36: 25 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్)తో కలిసి రఘువంశీ (44: 32 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) ఆదుకున్నారు. వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలతో స్కోర్ బోర్డును కదిలించారు. ఈ క్రమంలో స్వల్ప తేడాతో వీరిద్దరూ ఔటయ్యారు. అయితే రస్సెల్ (17: 9 బంతుల్లో 2 సిక్సులు, ఒక ఫోర్) ధాటిగా బ్యాటింగ్ చేయడంతో కోల్‌కతా 200 పరుగులు దాటింది. ఢిల్లీ బౌలర్లలో స్టార్క్ 3, విప్రాజ్ నిగమ్ 2, అక్షర్ పటేల్ 2, చమీరా ఒక వికెట్ తీశారు.

## సూర్యవంశీని ఇంకా ఆడనివ్వండి : రవిశాస్త్రి



ఐపీఎల్ 2025 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున అరగేంట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ సత్తా చాటుతున్నాడు. తాను ఆడిన మూడో మ్యాచ్‌లోనే సెంచరీ సాధించి అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాడు. సోమవారం రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ బాల బ్యాటర్ కేవలం 34 బంతుల్లోనే సెంచరీ బాది పలు రికార్డులు సృష్టించాడు. వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌ను చూసి తాను సంభ్రమాశ్చర్యాలకు గురయ్యానని భారత మాజీ క్రికెటర్ రవిశాస్త్రి అన్నాడు. కానీ ఈ బ్యాటర్ విషయంలో మనం అప్పుడే ఓ అంచనాకు రాకూడదని, కాస్త ఓపిక పట్టాల్సిన అవసరం ఉందని విశ్లేషించాడు. 'లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన తన తొలి మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ కొట్టిన మొదటి షాట్ అందరినీ ఊపిరి బిగబట్టేలా చేసి ఉంటుంది. అతడు కుర్రాడే. ఇంకా ఎంతో క్రికెట్ ఆడాల్సి ఉంది. వైఫల్యాలు ఎదురైనప్పుడు వాటిని ఎలా ఎదుర్కొంటాడో చూడాలి' అని రవిశాస్త్రి తన అభిప్రాయం వ్యక్తం చేశాడు. వైభవ్ సూర్యవంశీ ముమ్ముందు మరిన్ని కఠిన సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందని రవిశాస్త్రి అన్నాడు. ముఖ్యంగా పేస్, బౌన్స్, షార్ట్ పిచ్ బంతుల రూపంలో బౌలర్లు ఈ యువ బ్యాటర్‌కు పరీక్ష పెడతారని జోస్యం చెప్పాడు. 'వైభవ్ మరోసారి బ్యాటింగ్ చేయడానికి వచ్చినప్పుడు పరిస్థితులు కాస్త కఠినంగానే ఉండొచ్చు. ఎందుకంటే ఓ బౌలర్ వేసిన మొదటి బంతినే సిక్స్‌గా మైదానం వెలుపలకు తరలిస్తే... అతడు ఇక కనికరం చూపడు. బ్యాటింగ్ చేస్తోంది 12, 14 ఏళ్ల పిల్లాడా? లేక 20 ఏళ్ల కుర్రాడా అని ఇక ఆ బౌలర్ చూడడు. బ్యాటర్ మీద ఏమాత్రం కనికరం చూపించడు. బౌలర్ల నుంచి ఇలా ఎదురయ్యే కఠిన పరీక్షలను ఎలా సమర్థంగా ఎదుర్కొంటాడో అనే దాని మీదే వైభవ్ ప్రగతి ఆధారపడి ఉంటుంది' అని భారత మాజీ కోచ్ రవిశాస్త్రి విశ్లేషించాడు.

## ముక్కోణపు సిరీస్.. సౌతాఫ్రికాపై భారత్ విజయం




**కొలంబో:** శ్రీలంక వేదికగా భారత్, శ్రీలంక, సౌతాఫ్రికా మహిళా క్రికెట్ జట్ల మధ్య ముక్కోణపు సిరీస్ జరుగుతోంది. ఇప్పటికే శ్రీలంకపై విజయం సాధించిన భారత్.. మంగళవారం సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో 15 పరుగుల తేడాతో గెలుపొందింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 276 పరుగులు చేసింది. ప్రతీకా రావల్ (78, 91 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి మెరిసింది. లక్ష్యఛేదనకు దిగిన సౌతాఫ్రికా 49.2 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. తజ్మిన్ బ్రిట్స్ (109బీ 107 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సులు) సెంచరీ చేసినా సఫారీలకు ఓటమి తప్పలేదు. లారా వొల్వార్ట్ (43) రాణించింది. భారత స్పిన్నర్ స్నేహ్ రాణా (5/43) సౌతాఫ్రికా పతనాన్ని శాసించింది. అరుంధతి రెడ్డి, నల్లపురెడ్డి చరణి, దీప్తి శర్మ తలో వికెట్ పడగొట్టారు. భారత బ్యాటర్లలో ప్రతీకా రావల్‌తోపాటు హర్మన్‌ప్రీత్ కౌర్ (41), జెమీమా రోడ్రిగ్స్ (41), స్మృతి మంధాన (36), హర్లీన్ డియోల్ (29), రిచా ఘోష్ (24) రాణించారు.

## స్వల్ప లాభాలకే పరిమితమైన సూచీలు



**ముంబయి :** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. రోజంతా స్వల్ప శ్రేణిలోనే కదలాడాయి. ఎంపిక చేసిన షేర్లలో మినహా పెద్దగా మార్కెట్‌లో కొనుగోళ్ల కళ కనిపించలేదు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సన్‌ఫార్మా, కోటక్ మహీంద్రా బ్యాంకు షేర్లలో అమ్మకాలు నమోదు కాగా.. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమంగానే కదలాడాయి. సెన్సెక్స్ ఉదయం 80,396.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,218.37) ఓ మోస్తరు లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,122.02 – 80,661.31 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి 70.01 పాయింట్ల లాభంతో 80,288.38 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 7.45 పాయింట్లు లాభపడి 24,335.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.25గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్ ఇండస్ట్రీస్ (2.20%) షేరు వరుసగా రెండోరోజూ లాభాల్లో ముగిసింది. దీంతో పాటు టెక్ మహీంద్రా, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అల్ట్రాటెక్ సిమెంట్, సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64 డాలర్ల స్థాయి వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 3,322 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




## వాట్సప్ వెబ్ నుంచి నేరుగా కాల్స్..

### యాప్‌తో పనిలేదిక

యూజర్ల అవసరానికి తగ్గట్లు కొత్త కొత్త ఫీచర్లను అందించడంలో ప్రముఖ మెసేజ్ యాప్ వాట్సప్ ఎప్పుడూ ముందుంటుంది. తాజాగా మరో కొత్త సదుపాయంతో యూజర్ల ముందుకురానుంది. వాట్సప్ వెబ్ వినియోగదారుల యాప్‌తో పని లేకుండా వాయిస్, వీడియో కాల్స్ చేసే ఫీచర్‌ను అందుబాటులోకి తేనుంది. వాట్సప్ మొబైల్ యాప్, డెస్క్‌టాప్ వెర్షన్లకు చాలా కాలం నుంచే కాలింగ్ ఫీచర్ అందుబాటులో ఉంది. అయితే వాట్సప్ వెబ్ యూజర్లు ఈ సదుపాయం వినియోగించాలంటే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం తప్పనిసరి. ఇకపై ఆ సమస్య ఉండదు. యాప్‌తో పని లేకుండా నేరుగా కాల్స్ చేయొచ్చన్నమాట. అంటే త్వరలో వాట్సప్ వెబ్ చాట్స్‌లోనూ ఫోన్, వీడియో కాల్ ఐకాన్‌లు కనిపించనున్నాయి. ప్రస్తుతం ఈ ఫీచర్ ఇంకా పరీక్ష దశలోనే ఉందని వాట్సప్‌కు సంబంధించి ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ అందించే 'వాబీటా ఇన్ఫో' తన బ్లాగ్‌లో పంచుకుంది. త్వరలోనే యూజర్లకు అందుబాటులోకి తేనుందని తెలిపింది.

## ఇంటర్నెట్, వైఫై లేకుండానే లైవ్‌టీవీ..

### ఫోన్స్ తెచ్చేందుకు హెచ్‌ఎండీ, లావా రెడీ



మొబైల్‌లో టీవీ చూడాలంటే మొబైల్ డేటా అయినా ఉండాలి.. లేదంటే వైఫై కనెక్షన్ అయినా ఉండాలి. ఈ రెండూ లేకుండానే మొబైల్‌లో టీవీ ప్రసారాలు చూడగలిగితే? అవును మీరు విన్నది నిజమే! ఈ తరహా మొబైల్స్‌ను తీసుకొచ్చేందుకు రెండు మొబైల్ తయారీ కంపెనీలు సిద్ధమవుతున్నాయి. గతంలో నోకియా పేరుతో ఫోన్లు తయారుచేసే హెచ్‌ఎండీ సంస్థ.. ఫ్రీస్ట్రీమ్ టెక్నాలజీస్, ఇతరులతో కలిసి డీ2ఎం ఫోన్లు మార్కెట్లో విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. లావా ఇంటర్నేషనల్ సైతం డీ2ఎం ఫీచర్ ఫోన్‌ను లాంచ్ చేయనున్నట్లు ప్రకటించింది. వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ 2025 ఈవెంట్ వేళ ఈ రెండు కంపెనీల నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. డీ2ఎం సేవలను అందించడానికి హెచ్‌ఎండీ సంస్థ ఫ్రీస్ట్రీమ్ టెక్నాలజీస్, తేజస్ నెట్‌వర్క్స్, సింక్లెయిర్‌తో కలిసి మొబైల్ ఫోన్‌ను రూపొందించింది. దీన్ని వేవ్స్ 2025 ఈవెంట్‌లో ప్రదర్శించనుంది. మే 1 నుంచి నాలుగు రోజుల పాటు ముంబయిలోని జియో వరల్డ్ సెంటర్ వేదికగా ఈ ఈవెంట్ జరగనుంది. లావా కూడా ఇన్‌హౌస్ ఆర్‌అండ్‌డీ టీమ్‌తో పాటు తేజస్ నెట్‌వర్క్స్‌తో కలిపి ఫీచర్ ఫోన్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపింది. మీడియాటెక్ ఎంటీ6261 ప్రాసెసర్, శాంఖ్య రూపొందించిన ఎస్‌ఎల్3000 చిప్‌తో ఈ మొబైల్ పనిచేస్తుంది. టీవీ ప్రసారాల కోసం యూహెచ్‌ఎఫ్ యాంటెన్నా ఉంటుంది. 2.8 అంగుళాల క్యూవీజీఏ డిస్‌ప్లే, 2,200 ఎంఏహెచ్ బ్యాటరీ ఈ ఫీచర్‌లో అమర్చారు.

### ఏమిటీ టెక్నాలజీ?

మొబైల్ ఫోన్లలో ఎఫ్ఎం రేడియో ప్రసారాల తరహాలో టీవీ కార్యక్రమాలు అందించడమే డైరెక్ట్-టు-మొబైల్ (డీ2ఎం) పరిజ్ఞానం. దీన్ని పూర్తిగా దేశీయంగా రూపొందించారు. దీనికి వైఫై, ఇంటర్నెట్ వంటివి ఏవీ అవసరం లేదు. ఇప్పటికే పలు నగరాల్లో దీనికి సంబంధించిన ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. త్వరలో పెద్ద సంఖ్యలో ట్రయల్స్ ప్రారంభం కానున్నాయి. మొబైల్ టీవీ ప్రసారాలతో పాటు అత్యవసర హెచ్చరికలకూ డీ2ఎం పరిజ్ఞానాన్ని వాడుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## బజాజ్ చేతక్ నుంచి చౌకైన ఎలక్ట్రిక్ స్కూటర్



ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో తన చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ల శ్రేణిని మరింత విస్తరించింది. 35 సిరీస్‌లో 3503 పేరిట కొత్త చేతక్‌ను తాజాగా లాంచ్ చేసింది. దీని ధరను రూ.1.10 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించింది. చేతక్ 35 సిరీస్‌లో అందుబాటు ధరలో తీసుకొచ్చిన మోడల్ ఇదే కావడం గమనార్హం. బజాజ్ సంస్థ చేతక్ 35 సిరీస్‌లో కొన్ని నెలల క్రితం 3501 (టాప్ మోడల్) ధరను రూ.1.30 లక్షలుగా నిర్ణయించింది. చేతక్ 3502 మోడల్ ధరను రూ.1.22 లక్షలుగా పేర్కొంది. అప్పట్లో 3501ను కూడా తీసుకొస్తామని ప్రకటించింది. తాజాగా అందుబాటు ధరలో దీన్ని తీసుకొచ్చింది. ఇది టీవీఎస్ ఐక్యూబ్ 3.4, ఓలా ఎస్1ఎక్స్‌ం, ఏథర్ రిజ్తా ఎస్ వంటి మోడళ్లకు పోటీగా నిలనుంది. 35 సిరీస్‌లో ఉన్న ఇతర మోడళ్లలానే చేతక్ 3503లోనూ అదే డిజైన్‌ను కొనసాగించారు. ఇందులో 3.5 బ్యాటరీ ప్యాక్ ఉంది. సింగిల్ ఛార్జ్‌తో 151 కిలోమీటర్లు ప్రయాణించొచ్చు. 35 లీటర్ సీట్ స్టోరేజీ కెపాసిటీ ఇచ్చారు. దీని టాప్‌స్పీడ్ గంటకు 63 కిలోమీటర్లు. హిల్‌హోల్డ్ అసిస్ట్, కలర్ ఎల్‌సీడీ క్లస్టర్, బ్లూటూత్ కనెక్టివిటీ, మ్యూజిక్ కంట్రోల్, కాల్ మేనేజ్‌మెంట్, రైడ్ మోడ్స్ (ఎకో, స్పోర్ట్స్), ఎల్ఈడీ హెడ్‌లైట్స్ వంటివి ఉన్నాయి. మెటల్ బాడీతో వస్తోంది.



## ఇన్ఫోసిస్‌లో నాలుగోసారి..

### 195 మంది ట్రైనీల తొలగింపు

ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌లో ట్రైనీల తొలగింపుల పర్వం కొనసాగుతోంది. తుది ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్‌లో విఫలమైన కారణంగా మరో 195 మందిని ఆ సంస్థ పక్కన పెట్టింది. ఈ ఏడాది ట్రైనీలను తొలగింపు చేపట్టడం వరుసగా ఇది నాలుగోసారి. పరీక్షలో ఫెయిల్ అయిన ట్రైనీలకు ఇ-మెయిల్ ద్వారా ఇన్ఫోసిస్ సమాచారం ఇచ్చినట్లు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. తొలగించిన ట్రైనీలకు ఇన్ఫోసిస్ ఉచితంగా శిక్షణ అందిస్తోంది. ఎన్ఐఐటీ, అప్‌గ్రాడ్ ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు 800 మందిని ట్రైనీలను ఇన్ఫోసిస్ తొలగించింది. అందులో 250 మంది ఈ సదుపాయాన్ని వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. మరో 150 మంది ఇన్ఫోసిస్ అందిస్తున్న ఔట్ ప్లేస్‌మెంట్ సేవల కోసం రిజిస్టర్ చేసుకున్నట్లు తెలిసింది. ఇన్ఫోసిస్ తొలుత ఫిబ్రవరి నెలలో 300 మంది ట్రైనీలను తొలగించింది. మార్చిలో 30–35 మందిని, ఏప్రిల్‌లో 240 మందిని తొలగించింది. తాజాగా ఇది నాలుగోసారి. తొలగించిన ట్రైనీలకు ఒక నెల ఎక్స్‌గ్రేషియాతో పాటు రిలీవింగ్ లెటర్‌ను కూడా ఇస్తోంది. ప్రస్తుతం తొలగించిన ట్రైనీలు 2022లో ఇన్ఫోసిస్ నియమించుకుంది. వీరిని 2024 అక్టోబర్‌లో ఆన్‌బోర్డ్ చేసుకున్నట్లు 'బిజినెస్ స్టాండర్డ్' పేర్కొంది. కాగా, 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇన్ఫోసిస్ 15 వేల మంది ట్రైనీలను నియమించుకుంది.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# ఎన్టీఆర్-నీల్ మూవీ కొత్త రిలీజ్ డేట్



హైదరాబాద్: ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ చిత్రం కొత్త విడుదల తేదీని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ మంగళవారం ప్రకటించింది. 2026 జూన్25న 'ఎన్టీఆర్-నీల్' మూవీని విడుదల చేయనున్నట్లు తెలిపింది. తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్ర బృందం ప్రకటించింది. అయితే, కథకు ఉన్న డిమాండ్ దృష్ట్యా చిత్రీకరణకు మరి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. అలాగే పోస్ట్ ప్రొడక్షన్స్ పనులు సైతం ఆలస్యమయ్యేలా కనిపిస్తుండటంతో కొత్త విడుదల తేదీని ప్రకటించారు. 'కేజీయఫ్', 'సలార్' చిత్రాలతో ప్రశాంత్ నీల్ టేకింగ్ ఏంటో ప్రేక్షకులు చూశారు. దీంతో ఈ మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. వాటికి దీటుగా మూవీ ఉండాలంటే టేకింగ్/మేకింగ్ విషయంలో అస్సలు రాజీపడకూడదని ప్రశాంత్‌నీల్ భావిస్తున్నారు. దీంతో సినిమా విడుదల కాస్త ఆలస్యమైనా అభిమానులు కోరుకునే అన్ని అంశాలతో మూవీని తీసుకురావాలని భావించారు. అందుకే కొత్త విడుదల తేదీని ప్రకటించినట్లు టాలీవుడ్ టాక్. ఇప్పటికే ఈ మూవీ చిత్రీకరణ మొదలు కాగా, ఇటీవల ఎన్టీఆర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాల చిత్రీకరణ కూడా జరిగింది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసే స్పెషల్ గ్లింప్‌లో కొన్ని కీలక షాట్స్ కూడా చూసే అవకాశం ఉంది. ఎన్టీఆర్ సరసన ఇందులో రుక్మిణీ వసంత్ నటిస్తున్నారని, దీనికి 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉందని ప్రచారం సాగుతోంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారు. బరువు తగ్గి బాగా నాజూగ్గా కనిపిస్తున్నారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్... 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ కలిసి చేస్తున్న చిత్రమిది.

# అభిమానికి ప్రీతి జింటా క్షమాపణలు

బాలీవుడ్ నటి ప్రీతి జింటా ఓ అభిమానికి క్షమాపణలు చెప్పారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ప్రీతి ఎక్స్‌లో అభిమానులతో ముచ్చటించారు. వారు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ క్రమంలోనే ఓ అభిమాని 'మీరు భాజపాలో చేరుతున్నారా?' అని అడగ్గా.. దానికి ప్రీతి కాస్త కఠినంగా సమాధానమిచ్చారు. దీంతో నెట్టింట ఆమె తీరుపై విమర్శలు ప్రారంభమయ్యాయి. తాజాగా ఆ ప్రశ్న అడిగిన అభిమానికి ప్రీతి క్షమాపణలు చెప్పారు. 'కొన్ని రోజుల క్రితం మీరు చేసిన పోస్ట్ చూస్తుంటే భవిష్యత్తులో భాజపాలో చేరతారేమో అనిపిస్తుంది. రాజకీయాల్లోకి వస్తారా?' అని అడగ్గా.. దానికి ప్రీతి సమాధానమిస్తూ.. "సోషల్ మీడియాతో వచ్చే ఇబ్బంది ఇదే. ప్రతిఒక్కరూ మనల్ని జడ్జ్ చేస్తారు. నేను గతంలో చెప్పినట్లు దేవాలయాలకు, కుంభమేళాలకు వెళ్తే దాని అర్థం భాజపాలో చేరతానని కాదు. విదేశాల్లో ఉన్న సమయంలో దేశం విలువ నాకు తెలిసింది. అందరి కంటే నేను ఇప్పుడు భారత్‌ను, భారతీయ సంస్కృతిని ఎక్కువగా గౌరవిస్తున్నాను" అని అన్నారు. ఈ చిన్న ప్రశ్నకు ఇంత కఠినంగా జవాబివ్వాలా అని కొందరు విమర్శించారు. దీంతో తాజాగా ఆమె క్షమాపణలు చెప్పారు. "నా సమాధానం మీకు కఠినంగా అనిపిస్తే నన్ను క్షమించండి. మీ ప్రశ్న చూసి అసహనానికి గురయ్యాను. నేను విదేశాల్లో ఉంటున్నందుకు నా పిల్లలు భారతీయతను మర్చిపోకూడదు కదా..! అందుకే వారికి దేశ గొప్పతనం తెలియాలని దేవాలయాలకు తీసుకెళ్తాను. దురదృష్టవశాత్తూ నేను ఈ విషయంలో ప్రతిసారీ విమర్శలు ఎదుర్కొంటున్నాను. దీన్ని రాజకీయం చేస్తున్నారు. అందుకే అలా మాట్లాడాను. మీరంటే నాకు ఎప్పుడూ గౌరవమే" అని ఆ అభిమానికి వివరణ ఇచ్చారు. గతంలోనూ ప్రీతి జింటా తన రాజకీయ రంగ ప్రవేశం గురించి ప్రస్తావించిన విషయం తెలిసిందే. తనకు అలాంటి ఉద్దేశం లేదన్నారు. గతంలో తనకు కొన్ని రాజకీయ పార్టీలు టికెట్, రాజ్యసభ సీటు ఆఫర్ చేశాయని తెలిపారు.





# వరుణ్ తేజ్.. మేర్లపాక కాంబోలో మూవీ

బ్యాక్ టు బ్యాక్ డిజాస్టర్స్ తో డౌన్ ఫాల్ లో ఉన్నాడు మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్. ఎన్నో ఆశలు పెట్టుకున్న మట్కా మొదటి ఆటకే మకాం సర్దేసింది. దీంతో కాస్త గ్యాప్ తీసుకుని కథలపై దృష్టి పెట్టిన ఈ మెగా హీరో యంగ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ డైరెక్షన్ లో సినిమా చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు కొరియన్ కనకరాజ్ అనే క్రేజీ టైటిల్ ఫిక్స్ చేసినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ లోని ఆచార్య సెట్ లో జరుగుతుంది. సినిమాలో వచ్చే ఐటమ్ సాంగ్ కోసం అక్కడ నిర్మించిన ప్రత్యేక సెట్స్ లో సాంగ్ షూట్ చేస్తున్నారు. ఈ కోసం హాట్ బ్యూటీని రంగంలోకి దింపుతున్నారు. హుషారు, బంగార్రాజు వంటి సినిమాలలో మెప్పించిన దక్షా నాగర్కర్ కొరియన్ కనకరాజ్ లో వరుణ్ తేజ్ తో కలిసి ఆడిపాడనుంది. లాంగ్ గ్యాప్ తర్వాత వస్తున్న వరుణ్ తేజ్ ఈ సినిమాతో స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలని భావిస్తున్నాడు. ఈ సినిమా కోసం వరుణ్ తేజ్ తైక్వాండో లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు. వరుణ్ తేజ్ కెరీర్ లో 15వ సినిమాగా వస్తున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు. మరి వరుణ్ ఆశను మేర్లపాక గాంధీ నెరవేరుస్తాడో లేదో రానున్న రోజుల్లో తెలుస్తుంది.



# హీరోల కోసం త్రివిక్రమ్ చూపు

## వెంకటేశ్‌తో చేస్తాడన్న ప్రచారం

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ పైనే అందరి చూపు ఉన్నా..ఆయన చూపు ఎవరి వైపు అన్నదే ఇప్పుడు చర్చ. నిత్యం పెద్ద హీరోలు, భారీ బడ్జెట్ సినిమాలతో త్రివిక్రమ్ కాంపౌండ్ కళకళలాడేది. కానీ ఇప్పుడు వెలవెల బోతోంది. త్రివిక్రమ్ తో సినిమా చేసేందుకు హీరోలు దొరకని పరిస్థితి. హీరో అంటే ఇక్కడ స్టార్ హీరోలండి బాబు. ఈ పరిస్థితి రావడానికి కారణం కూడా మన గురూజీనే. కేవలం స్టార్ హీరోలతో మాత్రమే సినిమాలు చేస్తానని పట్టుబడతాడు. అదే దెబ్బ కొట్టేసింది. ఎందుకంటే స్టార్ హీరోలు అందరూ పాన్ ఇండియా బడ్జెట్ లో చేసేస్తున్నారు. పైగా రియలస్టిక్ సినిమాలకే జెండా ఊపుతున్నారు. క్లాస్ సినిమాలు తీసే త్రివిక్రమ్ కు ఇది అడ్డంకిగా మారింది. బన్నీతో సినిమా ఉంటుందని ప్రచారం జరిగినా.. అది ఇప్పట్లో ఉండేలా కనిపించలేదు. అట్లీ మూవీ అయ్యాకే ఉంటుంది. దానికి ఇంకో మూడేళ్లు పడుతుంది. అప్పటి దాకా ఖాళీగా ఉండటం కన్నా వెంకటేశ్ తో తీస్తే బెటర్ అంటున్నారు. కానీ దానికి త్రివిక్రమ్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావట్లేదు. త్రివిక్రమ్ తో చేయడానికి వెంకీ సిద్ధంగానే ఉన్నాడు. ప్రస్తుతం భారీ హిట్ తో ఖాళీగా ఉన్నాడు. కాబట్టి వెంకీతో మూవీ చేసి తానేంటూ త్రివిక్రమ్ నిరూపించుకుంటే బెటర్ అంటున్నారు ఆయన ఫ్యాన్స్. వెంకీ నటించిన ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలకు త్రివిక్రమ్ డైలాగులు రాశాడు. ఇద్దరి కాంబోలో వచ్చిన నువ్వు నాకు నచ్చావ్ పెద్ద హిట్. కాబట్టి మళ్లీ ఓ మూవీ చేస్తే బాగుంటుందని వీరి ఫ్యాన్స్ అంటున్నారు. మరి త్రివిక్రమ్ ఏం చేస్తాడో చూడాలి.

# చిత్రదర్శకురాలుకు అరుదైన గౌరవం


## ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీలో కపాడియాకు చోటు



భారతీయ చలనచిత్ర దర్శకురాలు పాయల్ కపాడియాకి అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్టాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025 జ్యూరీలో పాయల్ చోటు దక్కించుకున్నారు. గతేడాది పాయల్ దర్శకత్వంలో వచ్చిన 'ఆల్ వి ఇమాజిన్ యాజ్ లైట్స అనే చిత్రం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గ్రాండ్ పిక్స్ అవార్డు గెలుచుకున్న విషయం తెలిసిందే. ముంబై, కొంకణ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రం మహిళా స్నేహం, ప్రేమ ఆకాంక్షల గురించి రూపొందించబడింది. ఈ సినిమా విడుదలై ప్రశంసలు అందుకోవడమే కాకుండా.. 30 సంవత్సరాల తర్వాత కేన్స్ ఫెస్టివల్‌లో నిలిచిన మొదటి భారతీయ చిత్రంగా చరిత్ర సృష్టించింది. అయితే తాజాగా పాయల్ కపాడియా జ్యూరీ మెంబర్‌గా చోటు దక్కించుకుంది. ఈ వేడుకలో ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ అధ్యక్షురాలిగా ఫ్రెంచ్ నటి జూలియెట్ బినోష్ వ్యవహరించనుండగా.. జ్యూరీలో పాయల్‌తో పాటు హాలీవుడ్ నటి హాలీ బెర్రీ, ఇటాలియన్ నటి ఆల్బా రోర్‌వాచర్, కొరియన్ దర్శకుడు హాంగ్ సాంగ్సూ, కాంగోలీస్ దర్శకుడు డైయెడో హమాడి, మెక్సికన్ దర్శకుడు కార్లోస్ రేగాడాస్, ఫ్రెంచ్-మొరాకన్ రచయిత్రి లీలా స్లిమాని కూడా సభ్యులుగా చోటు దక్కించుకున్నారు. గతేడాది దర్శకురాలిగా ఎంట్రీ ఇచ్చిన పాయల్ ఈసారి జ్యూరీ సభ్యురాలిగా కేన్స్‌లో భారతీయ సినిమాకు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ చలనచిత్రోత్సవం మే 13 నుంచి 24 వరకు ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో జరగనుంది.

# హిట్-3తో వస్తున్న నాని

హ్యాట్రిక్ హిట్స్‌తో మంచి జోష్ మీదున్నాడు నాని. దసరా, సరిపోదా శనివారంతో హండ్రెడ్ క్రోర్ హీరోగా ఛేంజయిన న్యాచురల్ స్టార్ నుండి వస్తోన్న చిత్రం హిట్ 3. ఇప్పటి వరకు నాని కెరీర్‌లోనే మోస్ట్ వయెలెంట్ పిక్చర్‌గా రాబోతుంది. మే 1న థియేటర్లలోకి వచ్చేస్తున్నాడు అర్జున్ సర్కార్. ఇప్పటి వరకు ఈ సిరీస్ నుండి వచ్చిన టూఫిల్మ్స్ మంచి హిట్ కొట్టడంతో పాటు నాని హీరో కావడంతో హిట్ 3పై భారీ అంచనాలున్నాయి. అయితే హిట్ 3కి టఫ్ కాంపిటీషన్ ఇచ్చేందుకు హాలీవుడ్ తో పాటు కోలీవుడ్ చిత్రాలు వచ్చేస్తున్నాయి. సంక్రాంతి సీజన్ తర్వాత ఇప్పటి వరకు డ్రై సీజన్ నడిచింది. కొన్ని అడపా దడపా చిత్రాలు కొన్ని డబ్బింగ్ మూవీస్ సందడి చేశాయి. ఏప్రిల్ మొత్తం బాక్సాఫీస్ డల్ అయ్యింది. ఇప్పుడు మేలో వచ్చే సినిమాలపైనే హోప్స్. మేడేన వచ్చేస్తున్నాడు నాని. ఇదే సినిమాను పాన్ ఇండియా భాషల్లో డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. అయితే సౌత్, నార్త్ బెల్టులో హిట్ 3తో కొన్ని సినిమాలు పోటీపడుతున్నాయి. ముందుగా సూర్య.. హిట్ 3కి పోటీగా రెట్రోను మల్టీ లాంగ్వేజ్‌లో సినిమాను దింపుతున్నాడు. అలాగే టూరిస్ట్ ఫ్యామిలీ తమిళనాడులో రెట్రోతో పాటు హిట్ 3కి పోటీగా రాబోతుంది. హిందీ బెల్ట్‌లో చూస్తే సీనియర్లు అజయ్ దేవగన్ 2018లో వచ్చిన సక్సెస్ ఫుల్ మూవీ రైడ్‌కు సీక్వెల్‌గా రైడ్ 2 మే 1న రిలీజ్ చేస్తున్నాడు. సంజయ్ దత్ ది భూత్నీ కూడా అదే రోజు భయపెట్టేందుకు వస్తోంది. ఈ సినిమాలకే పిచ్చ కాంపిటీషన్ ఉంటే హాలీవుడ్ నుండి థండర్ బోల్ట్స్ వివిధ భాషల్లో రిలీజౌతుంది. ఇంత టఫ్ కాంపిటీషన్ ఉన్నప్పటికీ.. దేర్ చేసి వస్తున్నాడు నాని. ఇప్పటికే విపరీతమైన



ప్రమోషన్లను చేసిన న్యాచురల్ స్టార్. వీటికి తోడు ఐపీఎల్ ఉండనే ఉంది. మరీ ఇన్ని అవరోధాలను దాటుకుని నాని హిట్3 ఎలాంటి హిట్ కొడతాడో చూడాలి.




# థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో 'కిష్కింధపురి'..

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా రూపొందుతున్న ఫాంటసీ హారర్ థ్రిల్లర్ 'కిష్కింధపురి'. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. కౌశిక్ దర్శకుడు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీకి సంబంధించిన గ్లింప్స్‌ను మంగళవారం విడుదల చేశారు. ఆద్యంతం ఆకట్టుకునే కథ, కథనాలతో సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. ఆగస్టు లేదా సెప్టెంబరులో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98,
**RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com